నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

ఏటా రైతులకు మూడుసార్లు రూ.2 వేల చొప్పున రూ.6 వేలు

న్యూఢిల్లీ, జనవరి 1: రైతులకు లబ్ది చేకూర్చేందుకు ఉద్దేశించిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా పదో విడత నిధులను ప్రధాని నరేంద్ర మోడీ నేడు విడుదల చేశారు. ఒక్క క్లిక్ తో 10 కోట్లకు పైగా రైతుల ఖాతాలో రూ.21 వేల కోట్లు జమ చేశారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదిలో మూడుసార్లు చొప్పున మొత్తం రూ.6 వేలు అందిస్తున్న సంగతి తెలిసిందే.

తాజాగా నిధులు బదిలీ చేసిన సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. 2018 నుంచి ఇప్పటివరకు రూ.1.61 లక్షల కోట్ల మేర రైతులకు సాయం అందించామని అన్నారు. అంతేకాదు, 351 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు రూ.14 కోట్ల నిధిని కూడా నేడు విడుదల చేశారు. ఈ పథకం కింద 1.24 లక్షల మందికి పైగా రైతులకు లబ్ది చేకూరనుంది.

హైదరాబాద్ | ఆదివారం 2-1-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 125 | పేజీలు:4 | వెల: రూ.1/-

అంతర్జాతీయ సదస్సులకు మోడీ విదేశీ పర్యటనలు

న్యూఢిల్లీ, జనవరి 1:విదేశాలతో భారత్ సత్సంబంధాలు నెలకొల్పే దిశగా ప్రధాని నరేంద్ర మోడీ వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈనేపథ్యంలోనే మిత్రదేశాలైన యూఏఈ, కువైట్‌ల 2022 సంవత్సరంలో ప్రధాని మోడీ పర్యటించనున్నారు. అయితే ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో ఈ పర్యటన రద్దు అయినట్టు సమాచారం. దుబాయ్ 2020 ఎక్స్‌పోను సందర్శించేందుకు నిర్ణయించారు. జనవరి 6న మోడీ యూఏఈ వెళ్లాల్సి ఉంది. భారత్-యూఏఈ మధ్య దౌత్య సంబంధాలకు 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన ఖరారు చేశారు. 2015, 2018, 2019లో మోడీ యూఏఈని సందర్శించారు. యూఏఈలో 40లక్షల మంది భారతీయులు, కువైట్‌లో 10 లక్షల మంది నివాసం ఉంటున్నారు. వాతావరణం, జీవ వైవిధ్యం, అంతరిక్షం, పట్టణ, గ్రామీణ అభివృద్ధి, ప్రపంచ లక్ష్యాలు, ఆరోగ్యం, ఆహారం, వ్యవసాయం, జీవనోపాధిపై యూఏఈతో చర్చించాలని నిర్ణయించారు. గతంలో యూఏఈ పర్యటనకు వెళ్లి మోడీ.. ఆ దేశ అత్యున్నత పురస్కారం ఆర్డర్ ఆఫ్ జాయేద్‌ను స్వీకరించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మోడీ చేసిన కృషికి యూఏఈ ఈ పురస్కారాన్ని అందించింది.

జర్మన్ ఇంటర్ -గవర్నమెంట్ కన్సల్టేషన్స్ (ఐజీసీ) కోసం ప్రధాని మోడీ జర్మనీ వెళ్లనున్నారు. రెండు దేశాల మధ్య.. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ భేటీ నిర్వహిస్తారు. జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెలా 2019లో ఐజీసీ కోసం భారత్‌కు వచ్చారు. 2022, జీ-7 సమ్మిట్‌కు జర్మనీ ఆతిథ్యం ఇవ్వనుంది. ఇందులో భాగంగా కూడా మోడీ జర్మనీని పర్యటిస్తారు. ప్రధాన మంత్రి పర్యటనల్లో ఎక్కువ భాగం 2022లో యూరప్‌లోనే ఉంటుంది. రెండో ఇండియా-నార్డిక్ సమ్మిట్ కోసం మోడీ డెన్మార్క్ వెళ్లే అవకాశం ఉంది. ఈ ఏడాది అక్టోబర్‌లో డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్ పర్యటన నందర్భంగా 2022లో కోపెన్‌హాగన్‌లో జరగనున్న రెండో ఇండియా నార్డిక్ శిఖరాగ్ర సదస్సుకు ఆమె.. భారత్ ప్రధానిని ఆహ్వానించారు. ఈ సమ్మిట్‌లో సీడన్, నార్వే, ఫిన్లాండ్, డెన్మార్క్, ఐస్‌లాండ్ దేశాలు పాల్గొంటాయి.

జీ-20 సమ్మిట్‌కు ఈ ఏడాది ఇండోనేషియా నేతృత్వం వహిస్తున్నది. ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో 2022 అక్టోబర్‌లో జరిగే సమ్మిట్‌లో ప్రధాని మోడీకి అధ్యక్ష పదవిని అప్పగిస్తారు. భారతదేశం 2023లో మొదటి సారిగా జీ-20 సమ్మిట్‌కు ఆతిథ్యం ఇవనుంది. జీ-20 అధ్యక్ష పదవిని భారత్‌కు అప్పగించాల్సి ఉన్నందున మోడీ ఇండోనేషియా వెళ్తారు. భారత్ రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి 2022లో రష్యా వేదిక కానుంది. రెండు దేశాల మధ్య ప్రతీ సంవత్సరం జరిగే శిఖరాగ్ర సమావేశానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్‌లో న్యూఢిల్లీకి వచ్చారు. 2019లో రష్యాలోని వ్లాడివోస్టాక్‌లో నిర్వహించిన శిఖరాగ్ర సదస్సుకు మోడీ చివరి సారిగా హాజరయ్యారు.

రెండో క్వాడ్ ఇన్ పర్సన్ సమ్మిట్‌కు జపాన్ వేదిక అవుతున్నది. భారత్, యూఎస్, ఆస్ట్రేలియా, జపాన్‌ల క్వాడ్ గ్రూపింగ్ ఈ సంవత్సరం వర్చువల్‌గా భేటీ అయ్యింది. 2022లో జపాన్‌ను మోడీ పర్యటించనున్నారు. ఫిబ్రవరిలో ఈ క్వాడ్ సమ్మిట్ జరగనుంది. పొరుగున్న శ్రీలంకలో కూడా మోడీ పర్యటించనున్నారు. బే ఆఫ్ బెంగాల్ ఇంటివెటివ్ ఫర్ మల్టిట-సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్‌లో పాల్గొనేందుకు మోడీ వెళ్తారు. కామన్వెల్త్ సదస్సుకు ఆఫ్రికాలోని రువాండా ఆతిథ్యం ఇవ్వనుంది. కరోనా కారణంగా 2020, 2021 సమ్మిట్‌లు వాయిదా వేయబడ్డాయి. అదేవిధంగా ఆసియన్ సమ్మిట్ కోసం కంబోడియా, షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ కోసం ఉజ్బెకిస్తాన్, బ్రిక్స్ సదస్సు కోసం చైనాకు మోడీ వెళ్లనున్నారు. బ్రిక్స్, ఆసియన్ సమ్మిట్‌లు గత రెండేళ్లుగా వర్చువల్‌గా జరిగాయి.

ఇజ్రాయెల్‌లో కొత్త వైరస్ 'ఫ్లోరానా' కలవరం

ఇజ్రాయెల్,జనవరి 1 : ఇజ్రాయెల్ లో కొత్త వైరస్ కలకలం రేపుతోంది. ఇప్పటికే కరోనాలో కొత్త వేరియంట్లు పుట్టుకొచ్చి ప్రపంచాన్ని ఆందోళన పరుస్తున్న నేపథ్యంలో.. ఇజ్రాయెల్ ఈ కొత్త వైరస్ మరింత ఆందోళన రేకెత్తిస్తోంది. 'ఫ్లోరోనా' తొలి కేసు నమోదైంది. కరోనాతో పాటు ఫ్లూ కూడా సోకే డబుల్ ఇన్ ఫెక్షన్ నే ఫ్లోరోనా అని పిలుస్తున్నారు. ప్రసవం కోసం రాబిన్ మెడికల్ సెంటర్ లో చేరిన మహిళకు ఈ డబుల్ ఇన్ ఫెక్షన్ సోకినట్టు అధికారులు చెప్పారు.

ప్రస్తుతం ఈ కేసుపై అధికారులు విశ్లేషణ చేస్తున్నారు. ఈ రెండు వైరస్ లు కలిస్తే జబ్బు తీవ్రత పెరుగుతుందా? అన్న దానిపై విశ్లేషిస్తున్నారు. మరికొందరు పేషెంట్లలోనూ 'ఫ్లోరోనా' మూలాలు ఉండి ఉంటాయని చెబుతున్నారు. కాగా, ఇప్పటికే శుక్రవారం నుంచి ఆ దేశ ప్రభుత్వం నాలుగో డోసు కరోనా వ్యాక్సిన్ ను రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారికి, కరోనా ముప్పు ఎక్కువగా ఉన్న వారికి వేస్తోంది. తద్వారా నాలుగో డోసు వేస్తున్న తొలి దేశంగా ఇజ్రాయెల్ నిలిచింది.

హైదరాబాద్‌లో మరో భారీ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన కిషన్ రెడ్డి, కేటీఆర్

హైదరాబాద్, జనవరి 1:హైదరాబాద్ లో మరో భారీ ఫ్లై ఓవర్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. షేక్ పేట్ ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చింది. ఈ ఫ్లై ఓవర్ ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నూతన సంవత్సర బహుమతిగా ఈ ఫ్లైఓవర్ ని ప్రారంభించినట్లు చెప్పారు. దాదాపు 350 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో టోలిచౌకి రిలయన్స్ మార్ట్ నుంచి షేక్ పేట, రాయదుర్గం మల్కాజ్ వరకు అంటే దాదాపు 2.8 కిలోమీటర్ల మేరకు నిర్మాణం చేపట్టారు. దాదాపు మూడు కిలోమీటర్ల ఉంది ఈ ఫ్లై ఓవర్. హైదరాబాద్ నగరంలోని పొడవైన ఫ్లై ఓవర్ జాబితాలో చోటు సంపాదించుకుంది. ఈ ఫ్లై ఓవర్ ప్రారంభం కారణంగా మెహదీపట్నం ? హైటెక్ సిటీ మధ్య ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం పై హైదరాబాద్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లమ్మ ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి : మంత్రి తలసాని

హైదరాబాద్, జనవరి 1:బల్కంపేట ఎల్లమ్మ, మహంకాళి అమ్మవార్ల ఆశీస్సులతో నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలంతా పాడి పంటలు, సుఖ సంతోషాలతో జీవించాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరంను పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ, మహంకాళి అమ్మవారి ఆలయాల ఈఓలు అన్నపూర్ణ, మనోహర్ రెడ్డిల ఆధ్వర్యంలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ దంపతులను ఆశీర్వదించి ప్రసాదాలు అందజేశారు. జీహెచ్ఎంసీ జోనల్ రవి కిరణ్, ఈఈ సుదర్శన్, మహంకాళి ఏసీపీ రమేష్, పలువురు ఎస్ఐ లు మంత్రిని వెస్ట్ మారెడ్ పల్లిలోని నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కార్పొరేటర్ లు కొలన్ లక్ష్మీ, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, పలువురు టీఆర్ఎస్ పార్టీ నాయకులు మంత్రికి బొకే లను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 1:న్యూ ఇయర్, సంక్రాంతి వేళ వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరలను తగ్గిస్తూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ గుడ్ న్యూస్ తెలిపింది. 19 కేజీల కమర్షియల్ సిలిండర్‌పై రూ.102.50 తగ్గిస్తున్నట్లు, నేటి నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించింది. గత నెల1న వాణిజ్య సిలిండర్ ధరను రూ.100కు పైగా పెంచిన విషయం తెలిసిందే. ఇప్పుడు దాదాపు అంతే రేటును తగ్గించడం గమనార్హం. గత నెల ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర ఏకంగా రూ.2,101కు పెరిగింది. వాణిజ్య సిలిండర్లు హోటళ్లు, టీ స్టాల్ వ్యాపారుల వంటి వారు వాడతారు. ఆ సిలిండర్ల ధరను తగ్గించడంతో వారికి ఊరట లభించింది. తాజాగా తగ్గించిన ధరలతో ఇప్పుడు ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ.1998.50గా ఉండనుంది.

అయితే, గృహ అవసరాలను వినియోగించే వంటి గ్యాస్ ధరల్లో ఎలాటి మార్పులూ లేవు. 14.2, 5, 10 కిలోల కాంపోజిట్, 5 కేజీల కాంపోజిట్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చేయట్లేదని చమురు సంస్థలు తెలిపాయి. ఇటీవల సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ ధరను చమురు సంస్థలు భారీగా పెంచిన విషయం విదితమే. ప్రస్తుతం 14.2కేజీల సిలిండర్ ధర ఢిల్లీ, ముంబైలో రూ.899.50గా ఉండగా, కోల్‌కతాలో రూ.926గా ఉంది. ఇక హైదరాబాద్‌లో ఆ సిలిండర్ ధర రూ.950కుపైనే ఉంది. సంక్రాంతి పండుగ ముందయినా వంట గ్యాస్ ధరలు తగ్గుతాయని భావించిన వంట గ్యాస్ వినియోగదారులకు నిరాశే మిగిలింది.

పుల్వామా ఆఖరి ఉగ్రవాదిని హతం చేసిన సైన్యం

న్యూఢిల్లీ, జనవరి 1:పుల్వామా ఉగ్రదాడిలో పాల్గొన్న చివరి టెర్రరిస్టుని భారత బలగాలు కాల్చిచంపాయి. పుల్వామా దాడిలో పాల్గొన్న ఉగ్రదవాదులను గతంలో పలు ఎన్ కౌంటర్లలో సైన్యం తుదముట్టించిన సంగతి తెలిసిందే. కాగా తాజా ఘటనతో పుల్వామా ముష్కరులు అందరినీ అంతమొందించినట్లే. కశ్మీర్ లోని అనంతనాగ్ జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్ లో సమీర్ దార్ అనే ఈ ఉగ్రవాదిని హతమార్చినట్టు కశ్మీర్ ఐజీపీ విజయ్ కుమార్ వెల్లడించారు. సమీర్ దార్ జైషే ఉగ్రవాద సంస్థలో అగ్రశ్రేణి కమాండర్. డిసెంబరు 30న జరిగిన ఎన్ కౌంటర్ లో సమీర్ దార్ తో పాటు మరో ఇద్దరిని కూడా మట్టుబెట్టినట్టు విజయ్ కుమార్ తెలిపారు. ఈ ఘటన మొన్ననే జరిగినప్పటికీ, డీఎన్ఏ టెస్టులు జరిపిన అనంతరం సమీర్ దార్ గుర్తింపును నిర్ధారించారు. మూడు సంవత్సరాల క్రితం 2019 ఫిబ్రవరి 14 పుల్వామాలో జరిగిన ఉగ్రదాడి యావత్ భారతదేశాన్నిగ్గ్నాంతికి గురి చేసింది. సీఆర్పీఎఫ్ కాన్వాయ్ పై ఉగ్రవాదులు విరుచుకుపడిన ఆనాటి ఘటనలో 40 మంది జవాన్లు అమరులయ్యారు.

వేములవాడ ముస్లిం టౌన్ కమిటీ నియామకం

రాజన్న సిరిసిల్ల, జనవరి 1(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలోని ముస్లిం టౌన్ కమిటీని శనివారం రోజున అధ్యక్షులు ఎండి.అక్రమ్,ఉపాధ్యక్షులు సయ్యద్ రసూల్ ఆధ్వర్యంలో కమిటీ నియామకాన్ని నిర్వహించారు.సెక్రటరీగా మొహమ్మద్ వలీ,క్యాషియర్ షేక్ రియాజ్, జాయింట్ క్యాషియర్ ఖాజా నయూమొద్దీన్, జాయింట్ సెక్రెటరీ ఎండి రఫీ,ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి షబ్బీర్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి పాషా, ముఖ్య సలహాదారుగా సయ్యద్ లాయక్ పాష,ఎంఎ. మన్నాన్,ఎండి పీర్ మొహమ్మద్,ఎంఏ. కలీం పాషా,ఎండి సలీం, ఎండి జుల్ఫీకర్ హుస్సేన్, ఎండి కరీం,కమిటీ మెంబర్స్ గా ఎండి మజర్ పాషా, ఎండి షకిల్, ఎండి ఇమ్రాన్,షేక్ పర్వేజ్, ఎం.ఎ రమీజ్ అహ్మద్, ఎండి షకీల్, ఎండి ముజాహిద్, ఎండి రహీం, ఎండి అంజాద్, ఎండి ఇబ్రహీం, ఎండి బర్కత్ అలీ, ఎమ్.డి షబ్బీర్ అలీ, ఆఫ్సర్, ఎండి షాదుల్లా, షేక్ అలీ, షేక్ యూసుఫ్, ఎండి అసద్, ఎండి బాబా, ఎండి ముజీబ్, షేక్ అహ్మద్ షరీఫ్ లను నియమించినట్లు వారు తెలిపారు.కమిటీ నియామకాన్ని ఎన్నుకున్నందుకు పట్టణ టౌన్ అధ్యక్షులు అక్రమ్, ఉపాధ్యక్షులు రసూల్ లకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైష్ణోదేవి ఆలయంలో తొక్కిసలాట.. 12 మంది మృతి

జమ్మూకాశ్మీర్, జనవరి 1:: కొత్త సంవత్సరం వేళ జమ్మూకశ్మీర్‌లో తీరని విషాదం నెలకొంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అమ్మవారి దర్శనం చేసుకునేందుకు వచ్చిన భక్తులు అక్కడ జరిగిన తొక్కిసలాటలో ఆమె చెంతకే చేరారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రఖ్యాత మాతా వైష్ణోదేవి ఆలయంలో ఈ ఘటన జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మృతులను ఢిల్లీ, హర్యానా, పంజాబ్, జమ్మూకశ్మీర్ వాసులుగా గుర్తించారు. క్షతగాత్రులను కాట్రా, కాక్రయల్ నారాయణ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం తర్వాత ఆలయాన్ని మూసివేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తెల్లవారుజామున 2.45 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్టు అధికారులు తెలిపారు.

ఇగోలకు పోయి కత్తులతో దాడి.. నలుగురికి గాయాలు..

అమరావతి, జనవరి 1:కొత్త ఏడాది నాడు సరికొత్త వివాదం తలెత్తింది.. ఇన్నాళు చూస్తూ చూస్తూ గమ్ముసవాళ్లు కాస్తా.. మాటా మాటా అనుకున్నారు. ఇగోలకు పోయి.. తగాదాపడ్డారు. చేయి చేయి చేసుకుని గొడవకు దిగారు.. కత్తులతో దాడి చేసుకునే కాడికి పోయిందీ లొల్లి.. ఈ ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. ఇదంతా పెంపుడు కోళ్ల విషయంలో వచ్చిన గొడవ అంటే అందరూ నవ్వే పరిస్థితి వచ్చింది.. పెంపుడు కోళ్ల విషయంలో రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న వివాదం.. ఏకంగా కొందరిని ఆస్పత్రి పాలు చేసింది. ఈ ఘటన కృష్ణ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని వీరులపాడు మండలం చెన్నారావు పాలానికి చెందిన రెండు కుటుంబాల మధ్య పెంపుడు కోళ్ల విషయంలో వివాదం ఏర్పడింది. వారం రోజుల నుంచి ఇరు కుటుంబాల మధ్య నిత్యం గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేడు ఇరు కుటుంబాలు ఏకంగా కత్తులతో దాడి చేసుకున్నారు.

మా కోళ్లు మా ఇంటివైపుకి వస్తున్నాయని ఒక ఫ్యామిలీ మరొక ఫ్యామిలీని ప్రశ్నించింది. కోళ్లను పెంచుకుంటున్న ఫ్యామిలీ పై పొరుగువారు గొడవకు దిగినట్లు బాధిత ఫ్యామిలీ చెబుతోంది. అది చూసిన తాము కోళ్లు ఇంటివైపు వస్తున్నాయని తిడుతూ ఉన్న వారిని.. ఇదేమిటి అని ప్రశ్నించినందుకు తమపై దాడి చేశారని బాధితులు చెబుతున్నారు.

హైదరాబాదులో ఎగ్జిబిషన్ 'నుమాయిష్' సందడి

హైదరాబాద్, జనవరి 1: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో 'నుమాయిష్' ఎగ్జిబిషన్ నేడు ఆరంభమై ఫిబ్రవరి 15 వరకు సందర్శకులకు కనువిందు చేయనుంది. అఖిల భారత పారిశ్రామిక ఎగ్జిబిషన్ (ఏఐఐఈ) సొసైటీ దీన్ని ఏటా నిర్వహిస్తుంటుంది. కరోనా కారణంగా గతేడాది ప్రదర్శనకు అనుమతించలేదు. తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ స్టాళు ఏర్పాటు చేస్తుంటారు.

ఈ ఏడాది కరోనా ఉన్నప్పటికీ ఎగ్జిబిషన్ నిర్వహణకు సర్కారు నుంచి అనుమతి లభించింది. 2,500 స్టాళ్ల ఏర్పాటుకు వీలున్నా, 1,600 స్టాళ్ల ఏర్పాటుకు మాత్రమే లైసెన్స్ లు జారీ చేసినట్టు సొసైటీ కార్యదర్శి ఆదిత్య తెలిపారు. టికెట్ ధరను పెంచలేదని, రూ.30గానే కొనసాగుతుందని చెప్పారు. కరోనా నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని సెంట్రల్ జోన్ డీఎస్పీ పి.విశ్వప్రసాద్ తెలిపారు. ఎగ్జిబిషన్ కు వచ్చే ప్రతీ ఒక్కరికీ మాస్కు తప్పనిసరి అని చెప్పారు. ఎవరైనా మాస్క్ లేకుండా కనిపిస్తే రూ.1,000 ఫైన్ విధిస్తామని స్పష్టం చేశారు.

ఒమిక్రాన్ వ్యాప్తి- తమిళనాడులో కఠిన ఆంక్షలు

చెన్నై, జనవరి 1దేశ వ్యాప్తంగా ఒమిక్రాన్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. తమిళనాడులో కూడా పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. ఆ రాష్ట్రంలో ఇప్పటికే 120కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో కఠిన ఆంక్షలను అమలు చేసేందుకు అక్కడి స్టాలిన్ ప్రభుత్వం సిద్ధమైంది.

మాల్స్, సినిమా థియేటర్లు, బస్సులు, పార్కులు, జిమ్స్, సెలూన్లు, యోగా సెంటర్లు, మెట్రో రైళ్లలో 50 శాతం ఆక్యుపెన్సీ మాత్రమే ఉండాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. అన్నిచోట్ల శానిటైజర్లను ఉంచాలని, శరీర ఉష్ణోగ్రతను పరీక్షించిన తర్వాతే లోపలకు పంపించాలని పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు ఈ నెల 10 వరకు ఆన్ లైన్ లో మాత్రమే క్లాసులు ఉంటాయి. పెళ్లిళ్లకు 100 మందికి మించి, అంత్యక్రియలకు 50 మంది కంటే ఎక్కువ మంది హాజరుకాకూడదు.

మంత్రి కేటీఆర్, ఎంపీ జోగినపల్లిని కలిసిన టీఎస్ఎస్జీడీసీ ఛైర్మన్

హైదరాబాద్, జనవరి 1:తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎస్జీడీసీ) ఛైర్మన్ డా.దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ తన జన్మదినం సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారక రామారావును, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఛైర్మన్ గా నియమించడం పట్ల అభినందిస్తూ.. సీఎం తనపై ఉంచిన ఈ నమ్మకంను నిలబెట్టుకునేలా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అందరికీ చేరేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

చరిత్రలో నేటినిజం

తెలంగాణ సాహితీ త్రిమూర్తులకు పురస్కారాలు

(ముగ్గురు తెలంగాణ సాహితీ త్రిమూర్తులకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు ప్రకటించిన శుభ వేళ అక్షరాభినందనలు)

సాహితీ సేద్యం చేస్తున్న దేశ దిగ్గజాలకు కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కేంద్ర సాహితీ అకాడమీ పురస్కారాలు ప్రతి ఏట ప్రకటించడం ఆనవాయితీగా జరుగుతోంది. 2021 ఏడాదికి తెలంగాణకు చెందిన సాహితీ త్రిమూర్తులు గోరేటి వెంకన్న, తగుళ్ళ గోపాల్, దేవరాజ్ మహారాజులకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులను ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్ర సాహితీ రంగంతో పాటు పౌర సమాజం కూడా పరమానందంలో మునిగి పోతున్నది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అవార్డుల జాబితాలో 20 భారతీయ భాషల సాహితీ మూర్తులకు పురస్కారాలు దక్కాయి. దక్షిణ భారతీయ భాషల్లో తమిళ కథా రచయిత అంబాయ్, కన్నడ జీవిత చరిత్రల రచయిత గాంధీ కతన, మళయాలీ ఆత్మకథ రచయిత హృదయ రాగన్‌గల్‌లతో పాటు ఆంగ్ల నవల రచయిత నమిత గోఖలెలు పురస్కారాలకు ఎంపికైన జాబితాలో ఉన్నారు.

తెలంగాణ వేమన గోరేటి వెంకన్న, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత:

'గల్లీ చిన్నది గరీబోల్ల కథ పెద్దది', 'పల్లె కన్నీరు పెడుతుందో కనిపించే కుట్రల' అంటూ తెలంగాణ బడుగుల జీవన వ్యథలను పల్లె పాటగా తనదైన నాట్యంతో ఎగిరి ఆడుతూ, జీర గొంతుతో గానం చేస్తూ, తెలుగు ప్రేక్షకుల మనసులను పునీతం చేసిన కవి, గేయ రచయిత, నటుడు, వేదికపై ఎగిరి గంతేసే ప్రజావాగ్గేయ నటరాజు మన తెలంగాణ వేమన, తెలంగాణ మట్టి సాహితీ సుగంధం గోరేటి వెంకన్న. పేదోడి బతుకు, తెలంగాణ మట్టి వాసనలు ఉట్టిపడే పల్లె పదాలు, సామాన్యడి జీవన గమనాలు, గ్రామీణ ప్రకృతి పరిమళాలు, మానవ స్వభావాలను అలవోకగా పాటల మాలలుగా అల్లగల సాహితీ సేవకుడిగా గోరేటి వెంకన్న తెలియని, గళాన్ని వినని వారుండరంటే అతిశయోక్తి కాదు. 04 ఏప్రిల్ 1965న గోరేటి ఈరమ్మ- నర్సింహ దంపతులకు గౌరారం (తెల్కపల్లి), మహబూబ్‌నగర్ (నేటి నాగర్ కర్నూల్) జిల్లాలో జన్మించిన మట్టి బిడ్డ గోరేటి వెంకన్న చిన్నతనం నుంచే పల్లె పాటలు పాడడాన్ని ఇష్టపడుతూ, గురువు వెంకటరెడ్డి ప్రేరణతో గ్రామీణ గీతాల మాలలు అలవోకగా అల్లుతూనే, యంఏ వరకు విద్యను అభ్యసించారు. వెంకన్న పాటల్లో తెలంగాణ దుఃఖం, కష్టాల బతుకులు, కన్నీళ్ల ఊటలు, పల్లె పదాల వరదలు, పునరుజ్జీవన జాడలు పొంగి పొర్లుతూ కన్నీళ్ళను పెట్టిస్తాయి. మాటల జనం పాట రాయడం, పల్లె రాగం కైగట్టడం, జీర గొంతుతో పాటకు ప్రాణం పోయడం, ఎగిరి గంతేయడం అలవోకగా కుమ్మరించగల అనితర సాధ్యుడు మన గోరేటి వెంకన్న. గోరేటి నీ పాట సూపరన్న, నువ్వు గ్రేటన్న అని మనసారా అనకుండా ఉండలేం. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన గోరేటి వెంకన్న తామ్రపత్రం, శాలువా, లక్ష నగదు పురస్కారాన్ని అందుకోనున్నారు.

ప్రజా కవి, వాగ్గేయకారుడిగా?.:

గోరేటి వెంకన్న ఆటపాట ద్వారా సామాజిక తాత్వికతన కళ్లకు కట్టినట్టు, మనసు పులకించేట్లు ప్రజా సమస్యలను ఏకరువు పెడతారు. పల్లె మట్టి వాసన తెలిసిన వెంకన్న కవిత్వంలో మనిషికి ప్రకృతికి ఉన్న అవినాభావ బంధాన్ని, శ్రమైక జీవన వేదనలను ఆవిష్కరించిన వెంకన్న కలం నుంచి రేల పూతలు, అలచంద్ర వంక, పూసిన పున్నమి, ఏకనాదం మోత, పిట్ట వాలిన చెట్టు లాంటి పలు కవితా సంపుటాలు విడుదల అయ్యాయి. ఇటీవల గోరేటి వెంకన్న కలం గళం నుంచి జాలువారిన 'వల్లంకి తాళం' కవితా సంపుటికి గాను 2020-21 ఏడాదికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపిక కావడం హర్షదాయకం.

పురస్కారాల విజేతగా?.:

గోరేటి వెంకన్న సాహితీ సేవలను గుర్తించిన పౌర సమాజం, ప్రభుత్వాలు పలు అవార్డులతో సత్కరించాయి. నవంబర్ 2020 నుంచి తెలంగాణ ప్రభుత్వంలో యంయల్‌సిగా వెంకన్న సేవలు అందిస్తున్నారు. 'కళారత్న లేదా హంస అవార్డు', ఉగాది పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్ సినారె పురస్కారం, మహారాష్ట్ర ప్రభుత్వ 'కబీర్ సమ్మాన్', అరుణ్ సాగర్ అవార్డు, అధికార భాషా సంఘ పురస్కారం, తెలంగాణ ప్రభుత్వ 'కాళోజి నారాయణ రావు అవార్డు'లతో పాటు నేడు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం-2021 దక్కడం ముదావహం.

సినీ గేయ రచయిత, నటుడుగా?.:

కవిగా కలంతో, వాగ్గేయకారుడిగా గానంతో ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన గోరేటి వెంకన్న పాటలు సినిమాల్లో చిత్రీకరణ జరగడంతో పాటు నటుడిగా కూడా అందరి మన్ననలు పొందారు. ఎన్‌కౌంటర్, శ్రీ రాములయ్య, దొరసాని, కుబుసం, షీష్ మహల్, మల్లేశం, మైసమ్మ ఐపియస్, వేగు చుక్కలు, బతుకమ్మ, నగరం నిద్ర పోతున్న వేళ, పీపుల్స్ వార్, బందూక్, బస్తీ, అన్నదాత సుఖీభవ లాంటి సినిమాల్లో పాటల రచయితగా, నటుడిగా గుర్తింపు పొందారు. 'మా టివీ' ప్రసారం చేసిన 'రేలా కె రేలా' కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తూనే తన ఆట పాటలను తెలుగు ప్రేక్షకులకు పరిచయం కూడా చేసి ఇంటింటి పేరుగా నిలిచారు.

తగుళ్ళ గోపాల్, కేంద్ర యువ సాహిత్య పురస్కార గ్రహీత:

'దండ కడియం' కవితా సంపుటిని రచించిన రంగారెడ్డి జిల్లా, మాడ్గుల మండలం, కలకొండ గ్రామానికి చెందిన ముద్దు బిడ్డ యువకవి తగుళ్ళ గోపాల్‌కు 'కేంద్ర యువ సాహిత్య పురస్కారం' లభించింది. తగుళ్ళ ఎల్లమ్మ-కృష్ణయ్య దంపతులకు జన్మించిన గోపాల్ యంఏ తెలుగు పూర్తి చేశారు. ప్రస్తుతం నాగర్ కర్నూల్ వెల్దండ మండల అజిలాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. 'తీరొక్క పూవ్వు' అనే కవితా సంపుటిని కూడా విడుదల చేశారు. పాలమూరు సాహితీ ఆవార్డు, రాష్ట్ర యువ సాహిత్య పురస్కారం, రాయలసీమ సాహితీ పురస్కారం, రొట్టెమాకు రేవు సాహితీ ఆవార్డులు అందుకున్న గోపాల్‌కు నేడు 'దండ కడియం' కవిత సంపుటికి కేంద్ర యువ సాహిత్య పురస్కారం అందడం గర్వకారణం. తెలంగాణ యాదవ సమాజ జీవన వ్యథలను అక్షరీకరించడం, తెలంగాణ బతుకు వెతలను కవిత్వీకరించడం తెలిసిన యువ కవి, ఉపాధ్యాయుడు మన తగుళ్ళ గోపాల్. కేంద్ర యువ సాహిత్య పురస్కారంలో భాగంగా తామ్రప త్రం, శాలువతో పాటు ? 50,000/- నగదు పురస్కారాన్ని పొందనున్నారు.

దేవరాజు మహారాజు, కేంద్ర బాల సాహిత్య పురస్కార గ్రహీత:

ప్రముఖ రచయిత, అనువాద రచయిత, సైన్స్ వ్యాసకర్త, సామాజిక అంశాల వ్యాసకర్త, కథకుడు, నాటక రచయిత, వైజ్ఞానిక అంశాల్ని సామాన్యుల చెంతకు చేర్చగల దిట్ట, బాలల్ని ఆకట్టుకోగల కలం యోధుడు దేవరాజ్ మహారాజుకు 'నేను అంటే ఎవరు' నాటక రచనకు కేంద్ర బాల సాహిత్య పురస్కారం-2021 లభించడం తెలంగాణ వాసులకు గర్వకారణంగా గమనించాలి. 21 ఫిబ్రవరి 1951న జనగామ జిల్లా కోడూరులో జన్మించిన దేవరాజు కాకతీయ విశ్వవిద్యాలయంలో యంయస్‌సి (జువాలజీ) పూర్తి చేసి జంతుశాస్త్ర అధ్యాపకుడిగా సేవలందించిన దేవరాజు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పి హెచ్‌డి పట్టా పొందారు. సినిమా విశ్లేషణ, జానపద సాహిత్య పరిశీలన లాంటి సాహిత్య సేద్యం చేసిన దేవరాజు రచనలు పాఠ్యాంశాలుగా, పోటీ పరీక్షలకు తయారవుతున్న యువతకు ఉపయోగకరంగా నిలుస్తున్నాయి. రాజముద్ర, మధుశాల, నీకు నాకు మధ్య ఓ రంగుల నది లాంటి 85కు పైగా పుస్తకాలు రచించారు. తెలుగు విశ్వవిద్యాలయ ఆవార్డు, ఉగాది పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ కవితా పురస్కారం, దాశరథి పురస్కారం, ఎక్స్ రే పురస్కారం, సురమౌళి పురస్కారం వంటి ఎన్నో ఆవార్డులు అందుకున్న దేవరాజు నేడు బాల సాహిత్య పురస్తార విజేతగా తామ్రపత్రం, శాలువ, ? 50,000/- నగదు అందుకోనున్నారు.

తెలంగాణ సాహిత్య త్రయం గోరేటి వెంకన్న, తగుళ్ళ గోపాల్, దేవరాజు మహారాజులకు తెలంగాణ తెలుగు ప్రజల పక్షాన అభినందనలు, సాహితీవేత్తల పక్షాన వందనాలు తెలియజేద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

దేశవ్యాప్తంగా మొబైల్ తయారీ కంపెనీల మీద ఐటీ దాడులు

న్యూఢిల్లీ, జనవరి 1:విదేశీ నియంత్రణలో ఉన్న కొన్ని మొబైల్ హాండ్ సెట్ తయారీ సంస్థలమీద, వాటి అనుబంధ సంస్థలమీద ఆదాయ పన్నుశాఖ అధికారులు దేశవ్యాప్తంగా డిసెంబర్ 21 న సోదాలు, స్వాధీనాలు చేపట్టారు. కర్ణాటక, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలోని వివిధ ప్రదేశాలలో ఈ సోదాలు జరిగాయి.

రెండు ప్రధాన కంపెనీలు విదేశాలలో ఉన్న తన గ్రూప్ కంపెనీల తరఫున రాయల్టీ రూపంలో దాదాపు రూ.5,500 కోట్లకు పైగా చెల్లింపులు జరిపినట్టు ఈ సోదాలలో బైటపడింది. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న పత్రాల ప్రకారం అలాంటి ఖర్చుల రూపంలో చెల్లింపులు జరపటం తగిన పద్ధతి కాదని తేలింది.

మొబైల్ హాండ్ సెట్స్ తయారీకోసం విడిపరికరాలను కొనుగోలు చేయటానికి పాటించిన విధానాన్ని ఈ సోదాలు బైటపెట్టాయి. ఈ రెండు కంపెనీలు ఆదాయ పన్ను చట్టం, 1961 లోని నిబంధనలకు అనుగుణంగా నడుచుకోలేదని వెల్లడైంది. అనుబంధ సంస్థలతో నడిపిన లావాదేవీల సమాచారాన్ని వెల్లడించలేదు. అలాంటి తప్పిదం వల్ల ఆదాయ పన్ను చట్టం కింద జరిమానా సహా చర్యలకు బాధ్యులవుతారు. ఆ జరిమానా సుమారు రూ. 1000 కోట్లకు పైగా ఉండవచ్చు.

సోదా వలన మరో తరహా మోసం కూడా బైటపడింది. విదేశీ నిధులను భారతీయ ఖాతా పుస్తకాలలో చూపిస్తూ ఉన్నప్పటికీ వాటి మూలాలను సక్రమంగా వెల్లడించకపోవటం అనుమానాస్పద లావాదేవీలుగా మిగిలిపోతున్నాయి. దీనివలన ఇచ్చిన వ్యక్తి పరపతి స్థాయి ప్రశ్నార్థకంగా మారింది. ఆలా తీసుకున్న రుణం దాదాపు రూ. 5,000 కోట్లు. దానిమీద వడ్డీ కూడా క్లెయిమ్ చేశారు. ఖర్చుల పెంపు, అనుబంధ సంస్థల తరఫున చెల్లింపులు తదితర అంశాలకు సంబంధించిన సాక్ష్యాలు కూడా గమనించారు. దీనిద్వారా పన్ను విధింపుకు గురయ్యే లాభాలను ఈ మొబైల్ తయారీ కంపెనీలు తగ్గించుకున్నాయి. ఆ మొత్తం సుమారుగా ఆరు,1000 కోట్లకు పైనే ఉండవచ్చు.

ఈ కంపెనీలలో ఒకటి భారతదేశంలోని ఒక సంస్థ సేవలను వాడుకున్నప్పటికీ 2020 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చిన మూలంలో పన్ను తగ్గింపు నిబంధనను పాటించలేదు. ఆ విధంగా ఈ సంస్థ బాధ్యత మూలంలో పన్ను తగ్గింపు పరంగా దాదాపు రూ. 300 కోట్లు ఉంటుంది.

సోదా జరిగిన మరో కంపెనీ విషయానికొస్తే దాని వ్యవహారాల నీయంత్రణను పొరుగున ఉన్న మరో దేశం నుంచి జరిపినట్టు తేలింది. ఆ కంపెనీ భారతీయ డైరెక్టర్లు నిజానికి దాని నిర్వహణలో తమ పాత్ర ఏదీ లేదని ఒప్పుకున్నారు. కేవలం తమ పేర్లను వాడుకోవటానికి మాత్రమే ఇచ్చినట్టు చెప్పారు. సంబంధిత పన్నులు చెల్లించకుండానే దాదాపు రూ.42 కోట్లు ఉన్న కంపెనీ రిజర్వు నిధులన్నీటినీ భారతదేశం నుంచి వెలుపలికి తరలించేందుకు ప్రయత్నించారనటానికి ఆధారాలు కూడా సేకరించారు.

కొన్ని ఫిన్ టెక్, సాఫ్ట్ వేర్ కంపెనీల మీద జరిపిన సర్వే చర్యల ద్వారా తేలిందేమంటే, ఖర్చులను పెంచి చూపటం కోసం అనేక కంపెనీలను సృష్టించారని, ఆ విధంగా నిధులను తరలిస్తున్నారని. ఇందుకోసం కంపెనీలు సంబంధంలేని వ్యాపార అవసరాలకు చెల్లింపులు జరిపాయి. ఉనికిలో లేని ఒక తమిళనాడు కంపెనీ జారీ చేసిన బిల్లులను కూడా ఇందుకోసం వాడుకున్నారు. ఆలా తరలించిన మొత్తం దాదాపు రూ.50 కోట్లు ఉంటుంది.

మణిపూర్ రాష్ట్రంలోని చురాచంద్‌పూర్‌లోని ఛోతే గ్రామంలో 'ఉమెన్ యూనిటీ ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్'

న్యూఢిల్లీ, జనవరి 1:మణిపూర్ రాష్ట్రంలోని చురాచంద్‌పూర్‌లోని ఛోతే గ్రామంలో ఉమెన్ యూనిటీ ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్' (డబ్ల్యూయుఎస్‌ఎఫ్) ఒక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (డీఐ) సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ అప్ గ్రేడేషన్ శిక్షణా కార్యక్రమం, సామర్థ్య పెంపు శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఛోతే గ్రామంలో.. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ పరిధిలోని ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీ థోంగ్‌ఖోలున్ బైట్ ప్రారంభించారు. ఈ సమావేశాన్ని మెర్సీ డిమ్‌దైలాంగ్ ఎస్‌హెచ్‌జీ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే ప్రాసెసింగ్ యూనిట్, శిక్షణ కార్యక్రమం కూడా ప్రారంభించబడింది. శిక్షణ సంబంధించిన బ్యాసర్ రిబ్బన్ కటింగ్‌తో కార్యక్రమాన్ని

ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీ థోంగ్‌ఖోలున్ బైట్ ప్రారంభించారు. ప్రారంభ వేడుకల్లో ఛోతే గ్రామం అధినేత , చర్చి పెద్దలు, సీడీసీఆర్ఎంఎస్ చురచంద్‌పూర్ అధికారులు, ఎస్‌హెచ్‌జీ ఫెడరేషన్ చీఫ్ థాయోజాత్రా బోథే తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వీవర్స్ సర్వీస్ సెంటర్‌తో సంప్రదింపుల మేరకు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుంది, ఇది జనవరి 2వ వారంలో ప్రారంభమవుతుంది. ఎస్‌హెచ్‌జీలో ఆదాయ ఆర్జన కోసం టెక్స్‌టైల్ ఎలా వేగంగా వృద్ధి చెందుదన్న విషయమై ఆయన ఇక్కడ ప్రధానంగా వివరించారు, వీవింగ్, టైలరింగ్, ట్రైనింగ్ కమ్ ప్రొడక్షన్ సెంటర్ కోసం నిర్వహించబడే అన్ని రకాల శిక్షణలు, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ ఏ ఎఫ్‌పీఓగా పనిచేయడం కూడా నేర్పించబడుతుందని కూడా ఆయన ఇక్కడ వివరించారు.

టిసిఐఎస్ 2020-21లో ఆదాయం మరియు పన్ను తర్వాత మొత్తం వరుసగా రూ.17492.90 మిలియన్లు మరియు రూ.527.70 మిలియన్ల లాభాలను సాధించింది

న్యూఢిల్లీ, జనవరి 1:టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (టిసిఐఎల్) చైర్మన్ ఏ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సంజీవ్ కుమార్ రూ. 211.10 మిలియన్ల డివిడెండ్ చెక్కును టెలికమ్యూనికేషన్స్ విభాగం చైర్మన్ డిసిసి ఏ సెక్రటరీ శ్రీ కె. రాజారామన్‌కు అందించారు.

టిసిఐఎల్ ప్రారంభం నుండి నిరంతరం లాభాలను ఆర్జించే కంపెనీగా ఉంది. టిసిఐఎల్ 2020-21 వరకు ప్రభుత్వానికి రూ.2678.60 మిలియన్లు చెల్లించింది. ఈక్విటీలో ప్రభుత్వ ప్రారంభ పెట్టుబడి రూ. 3 మిలియన్లు. 2015-16లో రూ.160 మిలియన్లు మరింతగా చేరాయి. కంపెనీ యొక్క గ్రూప్ మరియు స్వతంత్ర నెట్‌వర్త్ 31 మార్చి, 2021 నాటికి వరుసగా రూ.9595.1 మిలియన్ మరియు రూ.6111 మిలియన్లు.

2020-21లో టిసిఐఎల్ స్వతంత్ర రాబడి మరియు పన్ను తర్వాత లాభం వరుసగా రూ.17492.90 మిలియన్ మరియు రూ.527.70 మిలియన్లను సాధించింది.

ఆగష్టు, 1978లో టిసిఐఎల్ స్థాపించబడింది. ఇది మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ కింద పనిచేసే మినీ రత్న కేటగిరీ - ఎ స్టేటస్ కంపెనీ. భారత ప్రభుత్వం తన వాటా మూలధనంలో 100% కలిగి ఉంది. టిసిఐఎల్ ఒక ప్రధాన ఇంజనీరింగ్ మరియు కన్సల్టెన్సీ కంపెనీ. టిసిఐఎల్ భారతదేశంతో పాటు విదేశాలలో అన్నిరకాల టెలికమ్యూనికేషన్స్, ఐటీ మరియు పౌర నిర్మాణ రంగాలలో ప్రాజెక్ట్‌లను చేపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలలో టిసిఐఎల్ ప్రాజెక్ట్‌లను అమలు చేసింది.

కంపెనీ యొక్క ఓవర్సీస్ కార్యకలాపాలు కువైట్, సౌదీ అరేబియా, ఒమన్, మారిషస్, నేపాల్ మొదలైన వాటితో పాటు పాన్ ఆఫ్రికా ఈ-విద్యా భారతి ఏఆరోగ్య భారతి నెట్‌వర్క్ ప్రాజెక్ట్‌తో పాటు 15 కంటే ఎక్కువ ఆఫ్రికన్ దేశాలు మరియు మరిన్ని ఆఫ్రికన్ దేశాలు చేరే అవకాశం ఉంది.

కంపెనీ అధిక విలువ కలిగిన ప్రభుత్వ కార్యక్రమాలను కూడా అమలు చేస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్, డిఫెన్స్, నేవీ ఓఎఫ్‌సి ప్రాజెక్ట్‌లు, ఏపీఎస్‌ఎఫ్‌ఎల్, తెలంగాణ ఫైబర్, బిబిఎన్‌ఎల్ విశాట్ మరియు ఎక్‌లవ్యస్కూల్ కోసం గ్రామీణ ఐసిటీ వంటిభారతదేశ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లను చేపడుతోంది.

సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచిన ఈశాన్య ప్రాంత మండలి, కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ, చంగ్లాంగన్ సమాఖ్య విజయాలు

న్యూఢిల్లీ, జనవరి 1:కలిసి కృషి చేస్తే ఏమైనా సాధించవచ్చునని రుజువు చేశారు ఆ మహిళలు. తమకు, తమ గ్రామానికి అవసరమైన సౌకర్యాలను కల్పించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు ఆ మహిళలు. మహిళల పట్టుదల, కృషికి ప్రభుత్వ శాఖల సహకారం తోడవడంతో ఆ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. ప్రజలు ముఖ్యంగా మహిళలకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మేఘాలయ రాష్ట్రంలో జరిగిన ఈ ప్రగతి సమాఖ్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుంది. నిరాదరణకు గురై అన్ని విధాలా దెబ్బతిన్న మహిళలు మేఘాలయకు చెందిన ఈశాన్య ప్రాంత మానవ వనరుల యాజమాన్య ప్రాజెక్ట్ అందించిన సహకారంతో స్వయం సహాయక బృందంగా ఏర్పడ్డారు. 30 సంవత్సరాల కిందట చాంగ్‌లాంగ్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు రహదారి, విద్యుత్, పాఠశాల లాంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండేవి కాదు. అయితే, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్న తపన వారిలో ఉంది. నల్లమందు ఈ ప్రాంత ఆర్థిక స్థితిగతులను మరింత దెబ్బ తీసింది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారిలో 99% మంది నల్లమందుకు అలవాటు పడ్డారు. పురుషులు నల్ల మందుకు బానిసలు కావడంతో మహిళలు ఇబ్బందులకు గురయ్యారు. భర్త నల్లమందు తీసుకోవడానికి అలవాటు పడడంతో భార్య పిల్లలు సమస్యల సుడిగుండంలో చిక్కుకు పోవలసి వచ్చింది. కుటుంబాలు ఆర్థికంగా చితికి పోయాయి. తమను, తమ పిల్లలను పోషించుకోవడానికి వీరు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. భర్తల నుంచి సహకారం అందాక, సరైన తిండి లేక, పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలియక మహిళలు నిరాశ నిస్పృహలతో జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇన్ని సమస్యలు ఉన్నా కష్టించి పని చేయాలన్న మనస్తత్వం ఆ మహిళల్లో ఉంది. అందరితో పాటు తాము కూడా ఆర్థికంగా నిలదొక్కు కోవాలన్న ఆశతో ఆ మహిళలు అవకాశాల కోసం ఎదురు చూస్తున్న సమయంలో స్వయం సహాయక బృందం రూపంలో వారికి అవకాశం లభించింది. ప్రగతి సాధించడానికి వారికి ప్రభుత్వ సహకారంతో పాటు స్వయం ఉపాధి, ప్రోత్సహించేవారి అవసరం. ఈ సమయంలో చంగ్లాంగన్ సమాఖ్య వారికి అండగా నిలిచింది. స్వయం ఉపాధి పొందేలా మహిళలకు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా వారు అభివృద్ధి సాధించేలా చూడాలన్న లక్ష్యంతో సమాఖ్య కార్యాచరణ రూపొందించింది.

ఈ గ్రామాల్లోని నివసిస్తున్న కుటుంబాల్లో ఎక్కువ కుటుంబాల నెలసరి ఆదాయం 100 రూపాయల కంటే తక్కువగానే ఉంది. దీనితో మహిళల పురోభివృద్ధి లక్ష్యంతో ఏర్పాటైన సమాఖ్య కార్యకలాపాలు ఆరు సంవత్సరాల పాటు ముందుకు సాగలేదు. దీనికి ప్రధాన కారణం ఆర్థిక వనరుల కొరత అని చెప్పాలి. ఈ ప్రాంతంలో చిన్న తోటల పెంపకం, తక్కువ భూమిలో వ్యవసాయం సాగించి కుటుంబ పోషణకు అంతంతమాత్రంగా సరిపోయే ఆదాయాన్ని ప్రజలు సంపాదించేవారు. సంవత్సరంలో ఆరు నెలలకు సరిపోయే సంపాదనతో వారు సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఆర్థికంగా ఎదిగే అవకాశం కూడా వారికి లేదు. ఈ ప్రాంత మహిళలు చేతితో వస్త్రాల అల్లిక, బియ్యం నుంచి బీర్ తయారు చేయడంలో నైపుణ్యం కలిగి ఉన్నారు. చేతితో వస్త్రాలు నేయడానికి ఎక్కువ సమయం పడుతుంది. అయితే, 30 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి మహిళలు నడుం నొప్పి, కీళ్ల నొప్పులు, కంటి చూపు తగ్గడం లాంటి కారణాల వల్ల వస్త్రాలను కూడా నేయలేని స్థితికి చేరేవారు. ప్రభుత్వ పరంగా వీరికి ఆర్థిక సహకారం అందేది కాదు.

ఇటువంటి సమయంలో 19 స్వయం సహాయక బృందాలు ఒక సమాఖ్యగా ఏర్పడి మహిళలకు అండగా నిలిచాయి. ఒంటరిగా వెళ్లి తమను ప్రోత్సహించాలని కోరలేని స్థితిలో ఉన్న మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులకు వెళ్లి సహకారం అందించాలని కోరడం ప్రారంభించారు. తమ సంప్రదాయ కళకు వాణిజ్య హంగులు దిద్ది వీరు ఆదాయం ఆర్జించి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

చంగ్లాంగన్ సమాఖ్య చుట్టుపక్కల ఉన్న స్వయం సహాయక బృందాలకు స్ఫూర్తిగా నిలిచింది. తాజాగా చంగ్లాంగన్ సమాఖ్య సభ్యులు కేకులను తయారు చేయడం ప్రారంభించారు. చంగ్లాంగన్ సమాఖ్య సభ్యుల చేస్తున్న కేకులు, కుకీలకు చంగ్లాంగన్ ప్రాంత ప్రజలు ఆదరించి కొనుగోలు చేస్తున్నారు.

చంగ్లాంగన్ జిల్లా యంత్రాంగం, అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం, సీసీఆర్ఎంఎస్ ల నుంచి శిక్షణ పొందిన స్వయం సహాయక బృందాలకు క్రిస్మస్ సందర్భంగా భారీగా ఆర్డర్లు అందాయి. శిక్షణ పొందిన మహిళలు మరికొంతమంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. నాబార్డ్ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈశాన్య ప్రాంత మండలి, కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ అందించిన సహకారంతో వారు స్వయంగా ఒక బేకరీ యూనిట్‌ను కూడా నడుపుతున్నారు.

ఇదివరకు ఈ ప్రాంతంలో ఒక్క బేకరీ యూనిట్ కూడా లేకపోవడంతో పుట్టినరోజు కేక్ కోసం అస్సాంకు వెళ్లాల్సి వచ్చేది. అందిన ఆర్డర్ల మేరకు స్వయం సహాయక బృందాలు అన్ని రకాల కేక్‌లు మరియు కుకీలను తయారు చేస్తున్నాయి. ప్రభుత్వ అధికారులు, అస్సాం రైఫిల్స్, సీఆర్ఎఫ్, పోలీసులు, విద్యార్థులు, ప్రజలు తమకు కావాల్సిన కేక్‌లు మరియు కుకీలను ఇక్కడ నుంచి పొందుతున్నాయి. జిల్లా యంత్రాంగం సహకారంతో జిల్లా గ్రంథాలయంలో స్వయం సహాయక బృందాలు ఒక ఫలహారశాల కూడా నడుపుతున్నాయి. కార్యకలాపాల ద్వారా వీరు నెలకు 20 వేల రూపాయల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. వీరు ఇంతవరకు 500కు పైగా కేకులు విక్రయించారు.

ఆత్మవిశ్వాసాన్ని కల్పించి ప్రోత్సాహం అందించి ఒక వ్యక్తి స్ఫూర్తి అందిస్తే మిగిలిన పనులన్నీ వాటంతట అవే పూర్తి అవుతాయి అన్న అంశం ఈ మహిళల విషయంలో రుజువయ్యింది.

అందరికీ రేషన్.. ఇళ్ల స్థలాలు.. కొత్త డేటా బేస్ ఏర్పాటు చేస్తున్న కేంద్రం..

న్యూఢిల్లీ, జనవరి 1:ఆహార ధాన్యాలను పొందడానికి రేషన్ కార్డు ఎంతో ముఖ్యం. రేషన్ పొందడానికి అవసరమైన పత్రాలు ఎంతో అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది నిరాశ్రయులు, నిరుపేదలు చౌకగా లభించే ఆహార ధాన్యాలు పొందడం లేదు. రేషన్ కార్డుల్లేని వారు కూడా ప్రయోజనాలు పొందేందుకు వీలుగా వారి డేటాను సేకరించేందుకు కేంద్రం నిర్ణయించింది. డేటాతో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. జనాభాలోని ఈ పేద, మధ్య తరగతి ప్రజలను ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఇళ్ల స్థలాలను కూడా అందించేందుకు కసరత్తు చేస్తున్నది.వారికి గుర్తింపు కార్డు లేకపోవడం, ఇంటి చిరునామా లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వాలు వారికి రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఇళ్లు లేని నిరుపేదలకు సంబంధించిన ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించనున్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద రేషన్ కార్డులు ఉన్న 81 కోట్ల మందికి పైగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ప్రభుత్వం రేషన్ అందిస్తోంది.

నిన్న ఒక్క రోజే 3,416 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్, జనవరి 1:తాగి వాహనాలను నడపవద్దని..దొరికితే భారీ ఫైన్‌తో పాటు జైలు శిక్ష విధిస్తామని పోలీసులు ఎంత చెప్పిన మందుబాబులు మాత్రం పోలిసుల హెచ్చరికలు ఏమాత్రం పట్టించుకోలేదు. తాగి వాహనాలను న

హర్యానాలో ఘోర ప్రమాదం : 20మంది కార్మికుల గల్లంతు



హర్యానా, జనవరి 1:హర్యానా, రాష్ట్రంలోని బివాని ప్రాంతంలో పెను ప్రమాదం జరిగింది. దాడమ్ మైనింగ్‌లో జోన్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో చాలా మంది కూలీలు ప్రమాదంలో చిక్కుకుపోయినట్టు తెలుస్తోంది. వాహనాలు శిథిలాల్లో ఉన్నాయని, అలాగే 20మంది కార్మికులు గల్లంతైనట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా వేస్తున్నారు. వారిని బయటకు తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దర్ని ఆసుపత్రికి తరలించారు. గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. హర్యానా వ్యవసాయ శాఖ మంత్రి జేపీ దలాల్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఒకరిద్దరు చనిపోయినట్టు ప్రచారం జరుగుతోందన్న ఆయన.. ప్రస్తుతానికి అధికారికంగా చెప్పలేమంటున్నారు. ప్రమాదంపై హర్యాన సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

హర్యానాలోని భివానీ జిల్లాలోని మైనింగ్ జోన్‌లో శనివారం కొండచరియలు విరిగిపడటంతో కనీసం ఇద్దరు వ్యక్తులు మరణించారు మరియు అనేక మంది చిక్కుకున్నారని భయపడ్డారు. తోషమ్ బ్లాక్‌లోని దాడం మైనింగ్ జోన్‌లో జిల్లా యంత్రాంగం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది.ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ త్వరితగతిన రెస్క్యూ ఆపరేషన్లు, క్షతగాత్రులకు తక్షణ సహాయం అందించడానికి స్థానిక పరిపాలనతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ట్వీట్ చేశారు.

ఢిల్లీలో కరోనా సామాజిక వ్యాప్తి.. ముంబైలో రూల్స్ స్ట్రిక్ట్..

న్యూఢిల్లీ, జనవరి 1:హస్తినలో ఊహించని విధంగా కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. ఢిల్లీలో గురువారం 1313 పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. బుధవారంతో పోలిస్తే.. గురువారం 42 శాతం అధికంగా కరోనా కేసులు వెలుగుచూశాయి. 7 నెలల తరువాత దేశ రాజధానిలో అధిక కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. మే 26న ఢిల్లీలో 1.93 శాతం పాజిటివ్ రేటుతో 1,491 కేసులు నమోదయ్యాయి. బుధవారం 923 కేసులు నమోదయ్యాయి. గురువారం ఏకంగా 1313కు చేరుకున్నాయి. గడిచిన 24 గంటల్లో 1.73 శాతం కరోనా పాజిటివిటీ రేటు నమోదైంది. ఇప్పటి వరకు 14లక్షల కేసులు నమోదవ్వగా.. 25వేల మంది చనిపోయారు. ప్రస్తుతం 3,081 యాక్టివ్ కేసులున్నాయి.

ముంబైలో కఠిన ఆంక్షలు

మహారాష్ట్రలో ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో ముంబైలో కఠిన ఆంక్షలు విధించింది. బీచ్‌లు, మైదానాలు, పార్ ?కలు, ఉద్యానవనాలు వంటి పబ్లిక్ ప్రాంతాలకు సాయంత్రం 5 గంటల తరువాత వెళ్లకుండా నిషేధం విధించింది. ఈ ఆంక్షలు శుక్రవారం మధ్యాహ్నం 1 గంట నుంచి అమల్లోకి వచ్చాయి. జనవరి 15 వరకు అమల్లో ఉంటాయని ముంబై పోలీసులు తెలిపారు. ప్రజారోగ్యం, భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. సాయంత్రం 5 నుంచి ఉదయం 5 వరకు బహిరంగ ప్రదేశాలకు వెళ్లడంపై నిషేధం విధించారు.

అమెరికాలో విస్ఫోటనం

అగ్రరాజ్యంపై కరోనా పంజా విసిరింది. గడిచిన 24 గంటల్లో 5.8లక్షల కొత్త కేసులు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నారులు రికార్డు స్థాయిలో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. డిసెంబర్ 22 నుంచి 28 మంది..రోజుకు సగటున 378 మంది చిన్నారులు ఆస్పత్రిలో చేరారు. వారంతా 17 ఏళ్లు కింద ఉన్నవారే అని నిపుణులు చెబుతున్నారు. గత వారంతో పోలిస్తే.. 66 శాతం పెరిగింది. అమెరికాలో గడిచిన 24 రోజుల్లో 5,72,029 మంది కరోనా బారినపడ్డారు. 1,362 మంది చనిపోయారు. ఇప్పటి వరకు 5.52 కోట్ల మంది కరోనాతో బారినపడగా.. 8.45లక్షల మంది మరణించారు. 4.14 కోట్ల మంది రికవరీ అయ్యారు.

వ్యవసాయ, ఆహార ఉత్పాదనల ఎగుమతుల వృద్ధిలో స్థిరత్వం!

న్యూఢిల్లీ, జనవరి 1: ప్రపంచవ్యాప్తంగా సరకుల వాణిజ్యంలో రవాణా, మౌలిక సదుపాయాల పరంగా ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ, గత పదేళ్లలో భారతదేశం వ్యవసాయ ఉత్పత్తుల, ప్రాసెస్డ్ ఆహార ఉత్పాదనల ఎగుమతులు స్థిరంగా పెరుగుతూ వచ్చాయి. వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పాదనల ఎగుమతి అభివృద్ధి ప్రాధికార సంస్థ (అపెడా) పరిధిలోని ఉత్పత్తుల ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. వాణిజ్య ఇంటలిజెన్స్, గణాంకాల డైరెక్టర్ జనరల్ కార్యాలయం (డి.జి.సి.ఐ.ఎస్.) అందించిన సమాచారం ప్రకారం 2011-12వ సంవత్సరంలో 17,321 మిలియన్ల అమెరికన్ డాలర్లు (రూ. 83,484కోట్లు)గా ఉన్న ఈ ఎగుమతులు,.. 2020-21వ సంవత్సరంలో 20,674మిలియన్ల అమెరికన్ డాలర్లకు (రూ. 15,30,50 కోట్లకు) పెరిగాయి.

అపెడా పరిధిలోని పలు వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల్లో, బాస్మతీయేతర బియ్యం అగ్రస్థాయిలో ఎగుమతి అయ్యింది. 2020-21వ ఆర్థిక సంవత్సరంలో జరిగిన మొత్తం ఎగుమతుల్లో దాదాపు నాలుగోవంతు స్థానాన్ని బాస్మతీయేతర బియ్యం ఎగుమతులే ఆక్రమించాయి.

2020-21వ సంవత్సరంలో జరిగిన ఎగుమతిలో మొదటి 3 స్థానాలను ఆక్రమించిన అపెడా ఉత్పత్తుల్లో బాస్మతీయేతర బియ్యం వాటా 23.32శాతం, బాస్మతీ బియ్యం వాటా 19.44శాతం, గొడ్డుమాంసం వాటా 15.34 శాతం ఉన్నాయి. మొత్తం ఎగుమతుల్లో ఈ మూడు ఉత్పాదనల ఉమ్మడి వాటా 58శాతంగా నమోదైంది.

భారతదేశపు బాస్మతీయేతర బియ్యం ఎగుమతుల విలువను 2020-21లో 4,799.91 మిలియన్ల అమెరికన్ డాలర్లు (రూ. 35,477 కోట్లు) గా లెక్కవేశారు. బాస్మతీ బియ్యం ఎగుమతి విలువను 4,018.71 మిలియన్ల అమెరికన్ డాలర్లు (రూ. 29,850 కోట్లు) గా, గొడ్డుమాంసం ఎగుమతుల విలువను 3,171.19 మిలియన్ల అమెరికన్ డాలర్లు (రూ. 23,460 కోట్లు) గా లెక్కించారు.

2020-21వ సంవత్సరంలో భారతదేశంనుంచి బాస్మతీయేతర బియ్యాన్ని ఎక్కువగా దిగుమతి చేసుకున్న దేశాల్లో బెనిన్, నేపాల్, బంగ్లాదేశ్, సెనెగల్, టోగో ఉన్నాయి. ఇక అదే సంవత్సరం భారతదేశంనుంచి బాస్మతీ బియ్యం ఎక్కువగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యెమెన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యు.ఎ.ఇ.)లకు ఎగుమతి అయ్యాయి. ఇక భారతదేశంనుంచి గొడ్డుమాంసం ఎక్కువగా దిగుమతి చేసుకున్న దేశాల్లో హాంకాంగ్, వియత్నాం, మలేసియా, ఈజిప్టు, ఇండోనేసియా ఉన్నాయి.

"ఎగుమతులను పెంపొందించేలా తగిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిని కేంద్రీకరిస్తాం. ఇందుకోసం వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో క్లస్టర్ల ఏర్పాటుకు మరింత ప్రాధాన్యం ఇస్తాం. ఈ విషయంలో 2018వ సంవత్సరపు వ్యవసాయ ఎగుమతి విధానానం నిర్దేశించిన లక్ష్యాన్ని పరిశీలనలోకి తీసుకుంటాం," అని అపెడా అధ్యక్షుడు డాక్టర్ అంగముత్తు అన్నారు.

వ్యవసాయ ఎగుమతి విధానం అమలుకోసం వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలతో కలసి అపెడా కృషి చేస్తోంది. ఎగుమతులకు సంబంధించి పలు రాష్ట్రాల కార్యాచరణ ప్రణాళికలు ఇప్పటికే ఖరారయ్యాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కేరళ, నాగాలాండ్, తమిళనాడు, అస్సాం, పంజాబ్, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మణిపూర్, సిక్కిం, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, మిజోరాం, మేఘాలయ రాష్ట్రాలకు సంబంధించిన ఎగుమతుల కార్యాచరణ ప్రణాళికలు ఇప్పటికే ఖరారు కాగా, మిగిలిన రాష్ట్రాల కార్యాచరణ ప్రణాళికలు ఖరారయ్యే క్రమంలో వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.) వెలువరించిన సమాచారం ప్రకారం, 2010లో 23,106మిలియన్ల అమెరికన్ డాలర్లుగా నమోదైన భారతదేశపు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 2019వ సంవత్సరంలో 37,371 మిలియన్ల అమెరికన్ డాలర్లకు పెరిగాయి. దీనితో గత పదేళ్ల కాలంలో ఉమ్మడి వార్షిక వృద్ధి రేటు (సి.ఎ.జి.ఆర్.) 5.49శాతంగా రికార్డయింది. 2010నుంచి 2019వరకూ ప్రపంచంలో వ్యవసాయ ఎగుమతుల సి.ఎ.జి.ఆర్. 3.11శాతంగా నమోదైంది.

ఇక, ప్రపంచ వ్యవసాయ ఎగుమతులకు సంబంధించి 2010లో 1.71 స్థానం ఉన్న భారతదేశపు వాటా 2019లో 2.1శాతానికి పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన వ్యవసాయ ఎగుమతులకు సంబంధించి 2010లో 17వ ర్యాంకులో ఉన్న భారతదేశం 2019లో 16వ ర్యాంకుకు చేరుకుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ.) వెలువరించిన సమాచారం ఈ అంశాలను తెలిపింది.అపెడా పరిధిలోని పది అగ్రశ్రేణి ఉత్పాదనలు ప్రపంచ వ్యాప్తంగా మరిన్ని ఎక్కువ దేశాలకు ఎగుమతి జరిగినప్పటికీ, గత దశాబ్దకాలంలో వాటి ఎగుమతులకు సంబంధించిన భారతదేశపు వాటాలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. 2020-21లో అపెడా పరిధిలోని పది అగ్రశ్రేణి ఉత్పాదనల వాటా విషయం పరిశీలించినపుడు,.. బాస్మతీయేతర బియ్యం (23.22శాతం), బాస్మతీ బియ్యం (19.44శాతం), గొడ్డు మాంసం (15.34శాతం), మిగిలిన ఉత్పత్తులు (3.84శాతం), వేరు శనగ (3.52), తృణధాన్యాల తయారీ పదార్థాలు (3.08శాతం), మొక్కజొన్న (3.07శాతం), గోధుమలు (2.66శాతం), ప్రాసెస్డ్ కూరగాయలు (2.43శాతం), ప్రాసెస్డ్ పండ్లు, పండ్ల రసాలు, గింజలు (2.07శాతం), జీడి పిక్కలు (2.03శాతం) ఉన్నాయి.ఇక, 2011-12వ సంవత్సరంలో జరిగిన ఎగుమతుల్లో పది అపెడా ఉత్పత్తుల వాటాలు ఇలా ఉన్నాయి. గౌర్.గమ్ (19.89శాతం), బాస్మతీ బియ్యం (18.60శాతం), గొడ్డు మాంసం (16.56శాతం), బాస్మతీయేతర బియ్యం (10.43శాతం), వేరుశనగ (6.32శాతం), మొక్కజొన్న (6.21శాతం), తృణధాన్యాల తయారీ పదార్థాలు (2.26శాతం), తాజా ఉల్లిపాయలు (2.07శాతం), ఆల్కహాలు పానీయాలు (1.76శాతం), ప్రాసెస్డ్ కూరగాయలు (1.47శాతం).

2020-21వ సంవత్సరంలో అపెడా పరిధిలోని పది ఉత్పాదనల ఎగుమతులే మొత్తం ఎగుమతుల్లో 78శాతానికి పైగా స్థానాన్ని ఆక్రమించాయి. 2010-11వ సంవత్సరంలో ఇవి 85శాతం స్థానాన్ని ఆక్రమించాయి.

2020-21వ సంవత్సరంలో అపెడా పరిధిలోని మొదటి పది ఉత్పాదనల ఎగుమతుల తీరు ఇలా ఉంది. బాస్మతీయేతర బియ్యం (4,799.91 మిలియన్ల అమెరికన్ డాలర్లు/ రూ. 35,477కోట్లు), బాస్మతీ బియ్యం (4,018.71 మిలియన్ల అమెరికన్ డాలర్లు/ రూ. 29,850కోట్లు), గొడ్డు మాంసం (3171.19 మిలియన్ల అమెరికన్ డాలర్లు / రూ. 23,460కోట్లు), ఇతర ఉత్పాదనలు (793.08 మిలియన్ల అమెరికన్ డాలర్లు/రూ. 5,866కోట్లు), వేరుశనగలు (727.4 మిలియన్ల అమెరికన్ డాలర్లు/రూ. 5,382కోట్లు), తృణధాన్యాల ఆహార పదార్థాలు (635.75 మిలియన్ల అమెరికన్ డాలర్లు/రూ. 4,706కోట్లు) మొక్క జొన్నలు (634.85మిలియన్ల డాలర్లు/రూ. 4,676కోట్లు), గోధుమలు (549.7 మిలియన్ల డాలర్లు/ రూ. 4,038కోట్లు), ప్రాసెస్డ్ కూరగాయలు (502మిలియన్ డాలర్లు/ రూ. 3,719కోట్లు), ప్రాసెస్డ్ పండ్లు, పండ్ల రసాలు, గింజలు (428 మిలియన్ డాలర్లు/ రూ. 3,173కోట్లు)

2011-12వ సంవత్సరంలో అపెడా పరిధిలోని మొదటి పది ఉత్పాదనల ఎగుమతుల తీరు ఇలా ఉంది. గౌర్.గమ్ (3446.37మిలియన్ల డాలర్లు/రూ. 16,524కోట్లు), బాస్మతీ బియ్యం (3,222.31మిలియన్ల డాలర్లు/రూ. 5,450 కోట్లు), గొడ్డు మాంసం (2,869.36 మిలియన్ డాలర్లు/రూ. 13,757కోట్లు), బాస్మతీయేతర బియ్యం (1,806.03 మిలియన్ల డాలర్లు/రూ. 8,659 కోట్లు), వేరుశనగలు (1,094.25 మిలియన్ డాలర్లు/రూ. 5,246 కోట్లు), మొక్కజొన్న (1,075.7 మిలియన్ల డాలర్లు/రూ. 5,158కోట్లు), తృణధాన్యాల తయారీ పదార్థాలు (3,92.21 మిలియన్ల డాలర్లు/రూ. 1,889కోట్లు), తాజా ఉల్లిపాయలు (359.36 మిలియన్ల డాలర్లు/రూ. 1,723 కోట్లు), ఆల్కహాలు పానీయాలు (304.4 మిలియన్ల డాలర్లు/రూ. 1,459 కోట్లు), ప్రాసెస్డ్ కూరగాయలు (254.56 మిలియన్ల డాలర్లు/రూ. 1,250 కోట్లు).

అపెడా సంస్థ తీసుకున్న అనేక చర్యల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల, ప్రాసెస్డ్ ఆహార ఉత్పాదనల ఎగుమతులు పెరిగాయి. ఎగుమతులను పెంపొందించేందుకు వివిధ దేశాల్లో బిజినెస్ టు బిజినెస్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం, వివిధ దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాల ప్రమేయంతో ఉత్పాదలకోసమే ప్రత్యేకించిన మార్కెటింగ్ ప్రచారం, సాధారణ మార్కెటింగ్ ప్రచారం చేయించడం వంటి కార్యక్రమాలను అపెడా నిర్వహించడంతో వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతులు పెరిగాయి.

ఇక, భౌగోళిక గుర్తింపు (జి.ఐ.)కోసం నమోదు చేసుకున్న వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార పదార్థాల ఎగుమతుల ప్రోత్సాహం కోసం కూడా అపెడా అనేక చర్యలు తీసుకుంది. వ్యవసాయ, ఆహార ఉత్పాదనలపై విక్రేతల, కొనుగోలుదార్ల సమావేశాలను అపెడా నిర్వహించింది. మన ఉత్పత్తులను ఎక్కువగా దిగుమతి చేసుకునే దేశాల ప్రమేయంతో వర్చువల్ పద్ధతిలో ఈ సమావేశాలను అపెడా నిర్వహించింది.

ఎగుమతి చేయాల్సిన ఉత్పత్తుల నాణ్యతా నిర్ధారణతో యోగ్యతా పత్రాల జారీ ప్రక్రియ నిరాటంకంగా జరిగేందుకు వీలుగా, దేశవ్యాప్తంగా 220 లేబరేటరీలను అపెడా సంస్థ గుర్తించింది. వివిధ రకాల ఉత్పత్తులపై నాణ్యతా పరీక్షల నిర్వహణా సేవలందించేందుకు, ఎగుమతుదార్లను గుర్తించేందుకు ఈ పరిశోధన శాలలను అపెడా గుర్తించింది.

ఎగుమతి ఉత్పాదనలపై పరీక్షల నిర్వహణకోసం గుర్తింపు పొందిన లేబరేటరీల స్థాయిని నవీకరించేందుకు, సదరు లేబరేటరీలను మరింత బలోపేతం చేసేందుకు కూడా అపెడా తగిన సహాయ సహకారాలను అందిస్తోంది. వ్యవసాయ ఉత్పాదనల ఎగుమతులను పెంపొందించడమే లక్ష్యంగా,..మౌలిక సదుపాయాల అభివృద్ధి, నాణ్యతా ప్రమాణాల మెరుగుదల, మార్కెట్ సదుపాయాల అభివృద్ధి వంటి ప్రక్రియలకోసం ఆర్థిక సహాయ పథకాలతో తగిన సహకారాన్ని కూడా అపెడా అందిస్తుంది.అంతర్జాతీయ స్థాయిలో జరిగే వాణిజ్య ప్రదర్శనల్లో ఎగుమతిదారులు, ఎగుమతి సంస్థల ప్రతినిధులు పాల్గొనేలా అపెడా తగిన చర్యలు తీసుకుంటుంది. ఎగుమతిదారులు తమ ఆహార ఉత్పాదనలను ప్రపంచ మార్కెట్ వేదికల్లో మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ వాణిజ్య ప్రదర్శనలు తగిన అవకాశాలు కల్పిస్తాయి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా,.. ఆహార్, ఆర్గానిక్ వరల్డ్ కాంగ్రెస్, బయోఫ్యాఫ్ వంటి జాతీయ స్థాయి కార్యక్రమాలను కూడా అపెడా నిర్వహిస్తుంది. ఉద్యాన పంటల ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్ స్థాయి నాణ్యతా ప్రమాణాలకు దీటుగా ఉండేలా చూసేందుకు పార్క్ హౌస్.ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా అపెడా నిర్వహిస్తుంది. వేరుశనగ కాయల తొక్కలను తొలగించడం, గ్రేడింగ్, ప్రాసెసింగ్ నిర్వహించడం వంటి ప్రక్రియలకు సంబంధించిన ఎగుమతి యూనిట్ల రిజిస్ట్రేషన్.ను కూడా అపెడా చేపడుతుంది. ఉదాహరణకు, యూరోపియన్ యూనియన్, యూరోపియన్ యూనియన్ మినహా ఇతర దేశాల నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా ఎగుమతి యూనిట్లను రిజిస్ట్రేషన్ ను అపెడా చేపడుతుంది.మాసం శుద్ధి ప్లాంట్ల రిజిస్ట్రేషన్, ప్రపంచ స్థాయి ఆహార భద్రతా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటం వంటి కార్యకలాపాలను అపెడా నిర్వహిస్తుంది. దిగుమతి చేసుకునే దేశాలు పాటించే ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాల మేరకు మన ఉత్పాదనలు ఉన్నాయా,.. లేదా,.. అన్న అంశాన్ని బేరీజు వేసేందుకు అవసరమైన వ్యవస్థను కూడా అపెడా నిర్వహిస్తుంది. ఎగుమతులను ప్రోత్సహించే ప్రక్రియలో భాగంగా, వివిధ రకాల అంతర్జాతీయ వాణిజ్య విశ్లేషణా సమాచారం, మార్కెట్ అనుసంధాన సమాచారం వంటి విషయాలను ఎగుమతిదార్లకు, ఎగుమతి చేసే సంస్థలకు పంపిణీ చేస్తుంది. అలాగే, వాణిజ్యపరమైన ఫిర్యాదులను, సందేహాలను అపెడా పరిష్కరిస్తుంది.

టీపీటీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, జనవరి 1:తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీయూ) నూతన డైరీ, క్యాలెండర్లను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈరోజు హైదరాబాద్ లో ఆవిష్కరించారు

. ఈసందర్భంగా జీఓ 317 ఆధారంగా ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల కేటాయింపుల్లో స్పౌజ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, జిల్లాలు మారిన జూనియర్ ఉపాధ్యాయులకు పరస్పర అంగీకారంతో బదిలీ కోరుకునే అవకాశం కల్పించాలని టీపీటీయూ చేసిన విజ్ఞప్తికి మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మట్టపల్లి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్, వ్యవస్థాపక అధ్యక్షులు జి.వేణుగోపాలస్వామి, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు భూపతి శ్రీనివాస్ , నాయకులు జి.మోహన్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీధర్ రావు, నల్లగొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు ఐ.నాగయ్య, బి.వెంకటేశం, జి.మాధవరెడ్డి, నాగేశ్వరరావు, అశ్వద్ధామ, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయపన్ను శాఖ కొత్త ఈ ఫైలింగ్ పోర్టల్‌లో 5.89 కోట్ల ఆదాయపన్ను రిటర్నులు దాఖలు

న్యూఢిల్లీ, జనవరి 1:ఆదాయపన్ను శాఖకు చెందిన కొత్త ఈ ఫైలింగ్ పోర్టల్ లో ఆదాయపన్ను రిటర్ను దాఖలు కు సంబంధించి, పొడిగించిన గడువు తేదీ అయిన 2021 డిసెంబర్ 31 నాటికి సుమారు 5.89 కోట్ల ఆదాయపన్ను రిటర్నులు దాఖలయ్యాయి. 31-12-2021 తేదీన 46.11 లక్షలకుపైగా ఆదాయపన్ను రిటర్నులు దాఖలయ్యాయి. పన్ను చెల్లింపుదారులు సులభంగా పోర్టల్ ద్వారా ఐటిఆర్ లు దాఖలు చేసేందుకు వీలుగా , పన్ను చెల్లింపుదారులు చేసిన 16,850 టెలిఫోన్ కాల్స్‌కు సమాధానాలు ఇవ్వడం జరిగింది. అలాగే 1467 చాట్ లకు హెల్ప్ డెస్క్ స్పందించడం జరిగింది. దీనికి తోడు, డిపార్టమెంట్ ఎప్పటికప్పుడు పన్ను చెల్లింపుదారులకు , ప్రొఫెషనల్స్‌కు అధికారిక ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా అందుబాటులో ఉంటున్నది. డిసెంబర్ 31 , 2021 న ఒక్కరోజే పన్ను చెల్లింపుదారులు, ప్రొఫెషనల్స్ నుంచి వచ్చిన 230 ట్వీట్లకు స్పందించడం జరిగింది.

2021-22 ఆదాయపన్ను సంవత్సరానికి 31 డిసెంబర్ నాటికి దాఖలైన 5.89 కోట్ల ఆదాయపన్ను రిటర్నులలో 49.6 శాతం ఐటిఆర్ 1 (2.92 కోట్లు) , 9.3 శాతం ఐటిఆర్ 2 (54.8 లక్షలు), 12.1 శాతం ఐటిఆర్ 3 (71.05 లక్షలు), 27.2 శాతంఐటిఆర్ -4 (1.60 కోట్లు), 1.3 శాతం ఐటిఆర్ 5 (7.66 లక్షలు), ఐటిఆర్ 6 (2.58 లక్షలు), ఐటిఆర్ 7 (0.67 లక్షలు) గా ఉన్నాయి. ఈ ఐటిఆర్ లలో 45.7 శాతం పైగా ఐటిఆర్ లు ఆన్ లైన్ ఐటిఆర్ సదుపాయాన్ని ఉపయోగించుకుని పోర్టల్ లోదాఖలైనవి. మిగిలినవి ఆఫ్‌లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారా అప్ లోడ్ చేసినవి.

2021 జనవరి 10 (ఆదాయపన్ను సంవత్సరం 2020-21కి పొడిగించిన గడువు)తో పోల్చి చూసినపుడు, మొత్తం దాఖలైన ఐటిఆర్ లు 5.95 కోట్లు. 2021 జనవరి 10 న చివరి రోజు దాఖలైన ఐటిఆర్ లు 31.05 లక్షలు కాగా ఈ సంవత్సరం గడువు చివరి రోజు దాఖలైన ఐటిఆర్ లు 46.11 లక్షలు.ఆదాయపన్ను చెల్లింపు రిటర్నులు దాఖలు చేయడంలో పన్ను చెల్లింపు దారులు, టాక్స్ ప్రొఫెషనల్స్, ఇతరుల పాత్రను ఆదాయపన్ను శాఖ అభినందించింది. వారందరి కృషితో ఇది సాధ్యమైందని తెలిపింది. అందరూ సులభమైన పన్ను చెల్లింపు అనుభవాన్ని పొందేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్టు ఆదాయపన్ను శాఖ పునరుద్ఘాటించింది..

మాతా వైష్ణోదేవి భవన్ వద్ద తొక్కిసలాట బాధితులకు 'పీఎంఎన్ఆర్ఎఫ్' నుంచి నష్టపరిహారం

న్యూఢిల్లీ, జనవరి 1: మాతా వైష్ణోదేవి భవన్ వద్ద తొక్కిసలాట దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు 'ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి' (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ట్వీట్ ద్వారా సమాచారమిస్తూ-"మాతా వైష్ణోదేవి భవన్‌లో తొక్కిసలాట జరిగి మరణించిన వారి కుటుంబాలకు 'పీఎంఎన్ఆర్ఎఫ్' నుంచి తలా రూ.2 లక్షల వంతున, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున నష్టపరిహారం అందజేయబడుతుంది: ప్రధానమంత్రి ఏనరేంద్రమోదీ" అని తెలిపింది.

ఏపీలో నేటి నుంచి వృద్ధులకు రూ.2500పెన్షన్ - సంతోషంగా ఉందన్న 'సీఎం జగన్'

అమరావతి, జనవరి 1:ఏపీలో నేటి నుంచి వృద్ధులకు రూ.2500పెన్షన్ ఇవ్వనున్నారు. ఈ నెల నుండి రూ.250పెంచింది ఏపీ ప్రభుత్వం. మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి మాటలను అమలు చేస్తున్నామని సీఎం జగన్ చెప్పారు. దేశంలోనే అత్యధిక పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీ అని అన్నారు. ప్రత్తిపాడు గుంటూరు జిల్లాలో జగన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. 62లక్షల కుటుంబాల్లో మరిన్ని చిరునవ్వులు రాబోతున్నాయని జగన్ తెలిపారు. మంచి కార్యక్రమం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. పేదలకు మంచి చేస్తుంటే విమర్శిస్తున్నారని జగన్ చెప్పారు. వృద్ధులకు మంచి చేయడం తప్పా అని జగన్ ప్రశ్నించారు. క్యాలెండర్లు మాత్రమే మారటం లేదన్నారు. గుండెల నిండా ప్రేమతో ప్రతి ఒక్కరికీ హ్యాపీ న్యూ ఇయర్ అని చెప్పారు.

2021 డిసెంబర్ నెలలో 1,29,780 కోట్ల రూపాయల జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ, జనవరి 1:దేశంలో 2021 డిసెంబర్ నెలలో 1,29,780 కోట్ల రూపాయల విలువ చేసే జీఎస్టీ వసూళ్లు జరిగాయి. దీనిలో సి జీఎస్టీ 22,578 కోట్ల రూపాయలుగా, ఎస్ జీఎస్టీ 28,658 కోట్ల రూపాయలు, ఐజీఎస్టీ 69,155 కోట్ల రూపాయలు (దిగుమతి అయిన వస్తువులపై వసూలు చేసిన 37,527 కోట్ల రూపాయలను కలుపుకుని), 9,389 కోట్ల రూపాయల సెస్ వసూళ్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన 614 కోట్ల రూపాయలతో సహా) ఉన్నాయి.

ఐజీఎస్టీ ఆదాయంలో సి జీఎస్టీ కి 25,568 కోట్ల రూపాయలను, ఎస్ జీఎస్టీ కి 21,102 కోట్ల రూపాయలను ప్రభుత్వం సర్దుబాటు చేసింది. సాధారణ సర్దుబాట్లు పూర్తయిన తర్వాత 2021 డిసెంబర్ నెలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లభించిన ఆదాయం 48,146 కోట్ల రూపాయలు (సి జీఎస్టీ),49,760 కోట్ల రూపాయలు (ఎస్ జీఎస్టీ) గా ఉంది.

గత ఏడాది డిసెంబర్ నెల తో పోల్చి చూస్తే దేశంలో 2021 డిసెంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లు 13 %, 2019 డిసెంబర్ నెలతో పోల్చి చూస్తే 26% మేరకు పెరిగాయి. ఈ నెలలో దేశంలో జరిగిన లావాదేవీలు (సేవల దిగుమతి తో కలుపుకుని)కంటే దిగుమతి చేసుకున్న వస్తువులపై 36% ఎక్కువ ఆదాయం వచ్చింది. గత ఏడాది డిసెంబర్ తో పోల్చి చూస్తే ఈ వృద్ధి 5% వరకు ఉంది.

2021 అక్టోబర్ నెలలో జారీ అయిన (7.4 కోట్లు) పోల్చి చూస్తే నవంబర్ నెలలో జారీ అయిన వే-బిల్లుల సంఖ్య (6.1) 17% మేరకు తగ్గింది. అయితే, నెలలో 1.30 లక్షల కోట్ల వరకు జీఎస్టీ వసూళ్లు జరిగాయి. పన్ను చెల్లింపుల అంశంలో కేంద్ర ప

రాజన్న సన్నిధిలో శాతవాహన యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ పూజలు

– కుటుంబసభ్యులకు మెమోంటో అందజేసిన లాయక్ పాషా

రాజన్న సిరిసిల్ల, జనవరి 1(నేటినిజం ప్రతినిధి):సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సంకసాల మల్లేశం కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రోజున దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు.

స్వామి వారి సన్నిధిలో కోడె మొక్కులు చెల్లించుకుని, కుంకుమ పూజ, అభిషేకం, స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం వైస్ ఛాన్సలర్ కుటుంబ సభ్యులకు రాజన్న ఆలయ అర్చక బృందం ఆశీర్వచనం గావించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. దర్శనానంతరం వైస్ ఛాన్సలర్ కుటుంబ సభ్యులకు టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా, ఆయాచితుల జితేందర్ లు స్వామి వారి చిత్ర పటం, రాజన్న ప్రసాదం, క్యాలెండర్ అందజేసి సత్కరించారు. ఆయన వెంట సూపరిండెంట్ సిరిగిరి శ్రీరాములు,రమేశ్, ఆలయ సిబ్బంది, యూనివర్సిటీ సిబ్బంది తదితరులు.

ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జనవరి 1(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం సందర్భంగా అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు పాడి పంటలు సమృద్ధిగా పండి రైతుల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అజ్మత్ అలీ జేఏసీ నాయకులు తిరుమల గౌడ్ బొజ్జ కనకయ్య కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగుల విష్ణుకుమార్,నాయకులు నాగులపర్నయ్య గౌడ్,దండుగుల తిరుపతి ఆటో యూనియన్ నాయకులు అంజద్ పాషా,సాబీర్ , కార్మికులు తదితరులు ఉన్నారు

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ కట్ చేసిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

–జిల్లా అధికారులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, జనవరి 1(నేటినిజం ప్రతినిధి): ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శనివారం నూతన సంవత్సరం దినోత్సవం

సందర్భంగా అధికారులంతో పాటు సిబ్బందితో కలసి కేక్ కట్ చేసి అధికారులకు పోలీస్ సిబ్బందికి, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు.

రి.అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎస్పీ అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,త్రిబుల్ రైడింగ్, అతివేగం అజాగ్రత్తగా వాహనాలు నడిపిన పలు వాహనాలను గుర్తించడం జరిగిందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిన్ను రాత్రి నిర్వహించిన డ్రైవ్ లో 22 మంది పట్టుబడడం జరిగిందని తెలిపారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ నిర్వహించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.అదికారులు,సిబ్బంది ని బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించామని వివరించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ లుచంద్రకాంత్ ,చంద్రశేఖర్ ,రవికుమార్ ,సి.ఐ లు ఆర్.ఐ లు ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు..

సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం..నలుగురు మృతి

సంగారెడ్డి, జనవరి 1:: కొత్త సంవత్సరం రోజున రహదారి రక్తదాహం నలుగురిని బలిదీసుకుంది. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ మండలం డిడ్గి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. బాలరాజు, శ్రావణి అనే దంపతులు, వారి ఎనిమిది నెలల చిన్నారి అమ్ములుతో కలిసి బైకుపై వెళుతుండగా, ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఆపై కారు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో బైకుపై ఉన్న దంపతులు, చిన్నారి సహా, కారులోని ఓ వ్యక్తి కూడా మరణించాడు. కాగా, మృతి చెందిన దంపతులు అనంతపురం జిల్లా గుత్తి మండలం బాచుపల్లికి చెందినవారిగా వెల్లడైంది.

స్వాగతం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చంచల్‌గూడ

తెలుగుశాఖ

సాహిత్యోపన్యాసము

తేది: గురువారం జనవరి, 6, 2022

ఉపన్యాసకులు

డా॥అయూచితం నటేశ్వర శర్మ

Retd. ప్రిన్సిపాల్ - ప్రాచ్య కళాశాల, కామారెడ్డి

Ex.డీన్ - ప్రాచ్య భాషల విభాగము, ఉస్మానియా విశ్వవిద్యాలయము

అంశము : సాహిత్య సంగీత సమ్మేళనము

శాఖాధ్యక్షులు డా॥ నాయని మల్లికార్జున

ప్రిన్సిపాల్ డా॥పూలపల్లి వెంకటరమణ

తాము పేర్లు పెట్టడంలో ఎలాంటి తప్పు చేయలేదు.. చైనా

బీజింగ్, జనవరి 1:: భారత్‌పై చైనా తన ప్రతాపం చూపిస్తూనే ఉంది. అందివచ్చిన ఏ చాన్స్ ని కూడా వదలడం లేదు. తాజాగా మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుని.. భారత్ ఆగ్రహానికి గురయ్యింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని 15 ప్రాంతాలకు చైనీస్ పేర్లు పెట్టింది. దీనిపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేయగ.. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి జావో లిజియాన్ ఓ ప్రకటన చేశారు. దక్షిణ టిబెట్‌లో అరుణాచల్‌ప్రదేశ్ తమ భాగమని.. తాము పేర్లు పెట్టడంలో ఎలాంటి తప్పు చేయలేదంటూ సమర్థించుకోవడం గమనార్హం.

ఇది తమ దేశ సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయం అంటూ.. తేలిగ్గా కొట్టిపారేయడం విశేషం. అరుణాచల్‌లో ఎన్నో సంప్రదాయ తెగలు చాలా ఏళ్లుగా నివాసం ఉంటున్నాయని జావో చెప్పుకొచ్చాడు. స్వయంప్రతిపత్తిగల ప్రాంతానికి తాము పేర్లు పెట్టడంలో తప్పేంటని ఎదురు ప్రశ్నించడం గమనార్హం. ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్‌ప్రదేశ్‌లోని 15 ప్రాంతాలకు చైనీస్ పేర్లు పెట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అరుణాచల్ భారత్ భూభాగం అని, కవ్వింపు చర్యలు మానుకోవాలంటూ భారత్ ధీటుగానే సమాధానం ఇచ్చింది. అయినా బెదరని డ్రాగన్.. తన వంకర బుద్ధి ప్రదర్శించింది. పేర్లు పెట్టినంత మాత్రానా.. అరుణాచల్‌ప్రదేశ్ చైనాది అయిపోదంటూ చురకలు అంటించింది. చాలా ఏళ్లుగా అరుణాచల్ తమదంటూ చైనా వాదిస్తోంది. ఆ ప్రాంతాన్ని జన్‌గ్నాన్‌గా పిలుస్తోంది.

కారులో చెలరేగిన మంటలు-ఓ వ్యక్తి దగ్ధం

నెల్లూరు జనవరి 1: నెల్లూరు జిల్లా గొలగమూడి దగ్గర కారులో మంటలు చెలరేగాయి. దాంతో కారు పూర్తిగా దగ్ధమయింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి సజీవదహనమయ్యాడు. కాగా కారులో మంటల వెనుక కుట్ర ఏమైనా ఉందా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. బహిరంగ ప్రదేశంలో కారు దగ్ధమయింది. వెంకటాచలం మండలం గొలగమూడి దగ్గర ఈ ఘటన జరిగింది. హత్యా, ప్రమాదమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ ఆర్ ఆర్ రిలీజ్ వాయిదా - స్పష్టం చేసిన నిర్మాణ సంస్థ

హైదరాబాద్, జనవరి 1:ఈ నెల 7న రిలీజ్ కావాల్సిన ఆర్ ఆర్ ఆర్ మూవీ వాయిదా పడింది. ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ నెల 7న ఆర్ ఆర్ ఆర్ మూవీ రిలీజ్ కావాల్సి ఉంది. మా చిత్రాన్ని వాయిదా వేయవలసి వచ్చింది. బేషరతుగా ప్రేమిస్తున్న అభిమానులు, ప్రేక్షకులందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు అని చిత్ర యూనిట్ తెలిపింది. వీలైనంత త్వరగా ఈ సినిమాని మళ్లీ మీ ముందుకు తీసుకువస్తామని హామీ ఇస్తున్నామని నిర్మాణ సంస్థ డివివి ఎంటర్ టైన్ మెంట్ తెలిపింది. ఈ మేరకు ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ ఓ ట్వీట్ ని పోస్ట్ చేశారు. కాగా ఈ చిత్రాన్ని దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తున్నాడు. ఈ మూవీలో యంగ్ టైగర్ ఎన్టీఆర్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలని పోషిస్తున్నారు.

ముది రాజ్ సంఘం అధ్యక్షునిగా పెండ్యాల శంకర్

రాజన్న సిరిసిల్ల, జనవరి 1(నేటినిజం ప్రతినిధి):వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో గ్రామ సర్పంచి పెండ్యాల తిరుపతి ఆధ్వర్యంలో శనివారం ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షునిగా పెండ్యాల శంకర్,ఉపాధ్యక్షులుగా జిట్ట వేణ మహేష్, కార్యదర్శిగా గుడి పెల్లి రాజుకోశాధికారిగా సంయుక్త కార్యదర్శి లిక్కి డి, తిరుపతి కార్యవర్గ సభ్యులుగా లిక్కి డి శ్రీనివాస్, గడిల వీరేశం, లిక్కి డి రాజు, నిమ్మల ఆగయ్య, పిట్టల కొండయ్య, గుడి పెల్లి వెంకటి, లిక్కి డి దేవయ్య, గడిలా రామస్వామి, గుడి పెల్లి కృష్ణ కుమార్, గడిల అంజయ్య ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పెండ్యాల శంకర్ మాట్లాడుతూ, నాపై నమ్మకంతో మూడు సార్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు నా ముదిరాజ్ సంఘ కులస్తులకు, గ్రామ సర్పంచ్ పెండ్యాల తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

అండమాన్ నికోబార్ ద్వీపంలో సంకల్ప్ స్మారకం ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జనవరి 1:అండమాన్ నికోబార్ దీవుల్లో సంకల్ప్ స్మారక చిహ్నాన్ని ఆ ద్వీపం కమాండర్ ఇన్ చీఫ్ ఆవిష్కరించారు.

ఇది నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను, ఆయన నిష్ట, కర్తవ్యం, బలిదానాన్ని, ఇండియన్ నేషనల్ ఆర్మీ, సైనికుల త్యాగాలను గుర్తు చేసే స్మారక చిహ్నంగా నిర్మించారు. 1941లో నేతాజీ బ్రిటిషర్ల కళ్లుగప్పి తప్పించుకొని బయటకు వెళ్లి తర్వాత మూడేళ్లకు మళ్లీ 1943లో డిసెంబర్ 29న పోర్ట్ బ్లయర్‌లో అడుగుపెట్టారు. 1943 కల్లా ఇండియన్ నేషనల్ ఆర్మీ భారత గడ్డపై అడుగుపెడుతుందని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

ప్రొవిన్షియల్ గవర్నమెంట్ ఆఫ్ ఆజాద్ హింద్ (ఆర్జి హుకుమత్ ఈ ఆజాద్ హింద్) అధిపతిగా, ఇండియన్ నేషనల్ ఆర్మీ సుప్రీం కమాండర్‌గా ఆయన అండమాన్ ద్వీపంలో అడుగుపెట్టారు. అండమాన్, నికోబార్‌ను ఇండియా తొలి స్వతంత్ర ప్రాంతంగా ప్రకటించారు. పోర్ట్ బ్లయర్‌లో 1943 డిసెంబర్ 30న తొలిసారి భారత గడ్డపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అండమాన్ ద్వీపానికి షహీద్ అని, నికోబార్‌కు స్వరాజ్ అని పేరు పెట్టారు.

BEFORE THE HON'BLE COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION: DCLI TWIN CITIES AT HYDERABAD

EC. NO.1 OF 2021

Between:

Byagari Shamantha @ Samantha & Others vs Byagarolu Goutham & Another

NOTICE

To

R1. Byagarolu Goutham
S/o. Nagappa, Aged Major
Occ: Owner of the vehicle.
R/o. H.No.12-2-708/2/1/A
VVN Vivekananda colony
Bhojagutta, Mehadipatnam
Hyderabad.

WHEREAS the Applicants have filed the above case for compensation against you under E.C Act and Rules and the same is posted for your appearance on **10.1.2022.**

Hence, you are requested to appear before the said Hon'ble Commissioner at 2.30 pm either in your person or through your Advocate on the said date, otherwise, the matter will be decided in your absence,

//BY ORDER //

Counsel for the Petitioners

M/S. P.SRINIVAS
N. RAJU NAIK
ADVOCATES
H.No.6-18/1, "SHREE" Nivas, Sreeram Nagar colony, Anupuram, Kapra, ECIL, Hyderabad- 500 06 2
Cell: 9246365011

రాజన్నను దర్శించుకున్న రాజన్న ఆలయం మాజీ చైర్మన్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జనవరి 1(నేటినిజం ప్రతినిధి):శనివారం నూతన సంవత్సరం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని ఆలయ మాజీ చైర్మన్ ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర సందర్భంగా మంచి జరగాలని ఆకాంక్షించారు. రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండి వారి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కూరగాయల కొమురయ్య, నాగుల విష్ణు ప్రసాద్, బీసీ సెల్ నాయకులు మే0డే రాజు తదితరులు ఉన్నారు

ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ లక్ష్యం: కిదాంబి శ్రీకాంత్

హైదరాబాద్, జనవరి 1:2024 సంవత్సరంలో జర గబోయే ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నానని అర్జున్ అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్ కిదాంబి శ్రీకాంత్ తెలిపారు. తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆహ్వానం మేరకు ఆయన కార్యాలయానికి వరల్డ్ బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ వచ్చారు. మీడియా సమావేశంలో కిదాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ 2022లో జరగబోయే కామన్ వెల్త్ గేమ్స్, ఏసియన్ గేమ్స్ మిగిలిన సూపర్ సిరీస్ మ్యాచ్‌లలో విజయం సాధించడానికి దృష్టి పెట్టానని చెప్పారు. తిరుపతిలో బ్యాడ్మింటన్‌ను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి 5 ఎకరాల స్థలం కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

నా ప్లేయింగ్ కెరీర్ పూర్తయిన తరువాత తిరుపతిలో అకాడమిని ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో క్రీడాకారులకు అందుబాటులో ఉండి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుతానన్నారు. క్రీడాకారులకు ఏ సందేహమున్నా వారందరికీ అందుబాటులో ఉండి క్రీడల్లో మరింత రాణించేలా సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు తిరుపతిలో తాను అకాడమీ ఏర్పాటు చేసేందుకు 5 ఎకరాలు కేటాయించడం మరచిపోలేనన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి



మాట్లాడుతూ కిదాంబి శ్రీకాంత్ సాధించిన విజయాల వల్ల దేశ ప్రతిష్టను ఎంతో ఎత్తుకు తీసుకెళ్లారన్నారు. ఆయన్ను ఆదర్శవంతంగా తీసుకుని ఎంతోమంది యువతకు, క్రీడాకారులు వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌కు ఎంపి గురుమూర్తి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మైనింగ్ జోన్‌లో కొండచరియలు విరిగిపడటంతో ఇద్దరు మృతి, ముగ్గురు సేఫ్!

చండీఘడ్, జనవరి 1:: రాష్ట్రంలోని మైనింగ్ జోన్‌లో శనివారం కొండచరియలు విరిగిపడటంతో దాదాపు 15 నుంచి 20 మంది ఘటనలో చిక్కుకున్నారు. తోషమ్ బ్లాక్‌లోని దాదం మైనింగ్ జోన్‌లో జిల్లా యంత్రాంగం రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. హర్యానాలోని భివానీ జిల్లాలో ఉన్న మైనింగ్ ఏరియాలో వాహనాల్లో వేరే ప్రాంతాలకు వెళ్తున్న కార్మికులపై కొండచరియలు విరిగిపడటంతో, వాహనాల్లో కార్మికులందరూ చిక్కుకున్నట్లు సమాచారం. త్వరితగతిన రెస్క్యూ ఆపరేషన్లు, క్షతగాత్రులకు తక్షణ సహాయం అందించడానికి జిల్లా యంత్రాంగంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ట్విటర్ వేదికగా తెలిపారు.

సంఘటన స్థలాన్ని పర్యవేక్షించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి జేపీ దలాల్ హుటాహుటిన చేరుకున్నారు. ఇప్పటివరకు ముగ్గురుని రక్షించి ఆసుపత్రికి తరలించామని, ఇద్దరు మృతి చెందారని, ప్రమాదంలో చిక్కుకున్నవారిని ప్రాణాలతో కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి మీడియాకు తెలిపారు.

కాగా దాదం మైనింగ్ ప్రాంతం, ఖనాక్ పహారీలో మైనింగ్ కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరుగుతుండేవి. ఐతే కాలుష్యం కారణంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన రెండు నెలలు నిషేధాన్ని గురువారం ఎత్తివేయగా శుక్రవారం నుంచి మైనింగ్ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. నిషేధం తర్వాత కేవలం ఒక్క రోజులోనే ఇంత పెద్ద ప్రమాదం జరడగంతో తాజా సంఘటన చర్చనీయాంశమైంది.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల, జనవరి 1(నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణం హరిత హోటల్ లో రాజన్న సిరిసిల్ల జిల్లా కురుమ యువ చైతన్య సమితి జిల్లా ఇంచార్జి ముత్త మహేష్ కురుమ ఆధ్వర్యంలో చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్ తో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా కురుమ సంఘం పెద్దల చేతులమీదుగా ×కురుమ యువ చైతన్య సమితి – తెలంగాణ× క్యాలెండర్ 2022 ఆవిష్కరించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురు మహిళలంతా ఐక్యంగా ఉండి ఆర్థిక రాజకీయ సామాజిక చైతన్యం కావాలని అన్నారు.పార్టీలకు సంబంధం లేకుండా ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దయ్యాల కొమురయ్య కురుమకురుమ సంఘం జిల్లా అధ్యక్షులు ఏనుగుల కనుకయ్య కురుమ , యువజన సంఘం అధ్యక్షులు మ్యాకల గణేష్ కురుమ వేములవాడ అధ్యక్షులు ఏనుగు కనుకయ్య కురుమ, వైస్ ఎంపీపీ జక్కుల తిరుపతి కురుమ, బావుసాయి పేట సర్పంచ్ గంగాధర్ కురుమ, వేములవాడ ఇంచార్జి మ్యాకల మనోహర్ కురుమ కురుమ, ఎల్లారెడ్డిపేట ఇంచార్జి పెద్దోళ్ల బాలయ్య కురుమ, మ్యాకల పర్శరాములు కురుమ, దర్శనాల లింగయ్య కురుమ , నాగరాజు కురుమ, ప్రశాంత్ కురుమ,కచ్చు పర్శరాములు కురుమ, మొగుళ్ళ శ్రీహరి కురుమ, మ్యాకల మహిపాల్ కురుమ, ఏనుగుల తిరుపతి కురుమ, సంబ పర్శరాములు కురుమ, గుంటి లక్ష్మన్ కురుమ తదితరులు ఉన్నారు.

ఆంధ్ర విజ్ఞాన మిత్ర మండలి, కస్పావీధి, బరంపురం

ESTD-1945

మొగలిపూవంటి ఘుమ ఘుమల తెలుగు – మమతాను బంధాల వెల్లువల తెలుగు

2022 నూతన ఆంగ్ల సంవత్సర స్వాగత తోరణం

ప్రపంచ ప్రఖ్యాత లెబనాన్ కవి

ఖలీల్ జిబ్రాన్ రచన 'ది ప్రాఫెట్' కు

డా॥ తుర్లపాటి రాజేశ్వరి గారి తెలుగు అనువాదం

'ప్రవక్త' ఆవిష్కరణ సభ

తేది : 03.01.2022 సోమవారం, రాత్రి 7.00 గం.లకు

వేదిక : శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం, కల్యాణ మంటపం, బరంపురం, ఒడిశా.

సభాధ్యక్షులు : శ్రీ పోలాకి శ్రీరామమూర్తి గారు
అధ్యక్షులు, ఆంధ్ర విజ్ఞాన మిత్రమండలి.

ముఖ్య అతిథి, శ్రీ పూడిపెద్ది సత్యనారాయణ గారు (బాబు), కార్యనిర్వాహక

మరియు అవిష్కర్త: అధ్యక్షులు, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య;
అధ్యక్షులు, ఆంధ్రబాషాభివర్ధనీ సమాజం, బరంపురం

పుస్తక పరిచయం : శ్రీ ఎన్.యస్.మూర్తి గారు

పుస్తక సమీక్ష : డా॥ కొల్లూరు నారాయణరావు గారు, స్వర్ణ కంకణ గ్రహీత
అసిస్టెంట్ ప్రొఫెసర్, కళ్ళికోట జూనియర్ కళాశాల

గౌరవ అతిథి : శ్రీ సుంకురు శ్రీకాంత్ గారు, వంశపారంపర్య ధర్మకర్త
శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం, బరంపురం.

రచయిత్రి : డా॥ తుర్లపాటి రాజేశ్వరి గారు

నిర్వహణ సహకారం : శ్రీ రవికుమార్ గుప్తా గారు, శ్రీ జమ్ముల షణ్ముఖరావు గారు,
శ్రీ వనమాలి విశ్వేశ్వర శర్మ గారు, కానూరి గోపాలకృష్ణ గారు

తెలుగు భాషా పరిమళగీతం : కుమారి. టి. శారద

అందరికీ సాదర ఆహ్వానం...

"ఎన్నో అనుభూతుల మాలికలతో నేను పలకరిస్తాను.
నేను సత్యమే పలికి ఉంటే నేను చెప్పిన సత్యాలు మరింత స్పష్టంగా ఆవిష్కరింపబడతాయి.
మీ ఆలోచనలకు చేరువ అవుతాయి." ఖలీల్ జిబ్రాన్, ప్రవక్త.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.